WWW.KALAMNIGHA.COM

కలం నిఘా

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ సోమవారం 16 డిసెంబర్ 2024

సంపుటి: 14, సంచిక: 257, పేజీలు 6, వెల: 4.00

Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam


## తబలా వాయిద్య కారుడు జకీర్ హుస్సేన్ కన్నుమూత



2

## ఫలితాలు రానప్పుడు మాత్రమే.. ఈవీఎంలను ప్రశ్నించడం తప్పు

ఒమర్ అబ్దుల్లా



2

## పదేళ్ల బీఆర్ఎస్ పాలనతోనే

# తెలంగాణ వెనకబాటు



తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు పోరాటం చేసిందెవరు? దాని ఫలితం అనుభవించిందెవరు? మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని ఇస్తే అప్పుల పాలు చేసిందెవరు?

- తెలంగాణ పీసీసీ చీఫ్

### ఏడాది కాలంలోని కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల వివరాలతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ

### రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందెవరు? అంటూ ప్రశ్నల వర్షం



**హైదరాబాద్ డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు నిరంతరం బురద జల్లుతూ ప్రజలను తప్పుదారి పట్టించడం మానుకోవాలంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ బహిరంగ లేఖ రాశారు. ఆరు పేజీల బహిరంగ లేఖలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు పోరాటం చేసిందెవరు? దాని ఫలితం అనుభవించిందెవరు? మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని ఇస్తే అప్పుల పాలు చేసిందెవరు? అంటూ సవాలక్ష ప్రశ్నలతో బహిరంగ లేఖను పంపారు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఆ లేఖలో వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలపై స్పష్టత ఇచ్చే దిశలో తాను ఈ లేఖ రాస్తున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనతోనే తెలంగాణ వెనకబాటుకు గురైందని ఆరోపించారు. సెంటిమెంట్ పేరుతో రెండుసార్లు ముఖ్యమంత్రి కుర్చీలోకి వచ్చిన కేసీఆర్, గడీల పాలన చేసి ప్రజలకు కన్నీరు మిగిల్చారని విమర్శించారు. నిరంతరం ఫాంహౌ స్‌లోనే : రాష్ట్రానికి గుండెకాయలాంటి సచివాలయానికి రాకుండా ఫాంహౌస్‌కే పరిమితమై పాలన సాగించారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. మొదటి ముఖ్యమంత్రిగా దళితుడిని చేస్తానని ..మిగతా 2లో



## భూమిలేని నిరుపేదలకు

# రూ.12 వేలు

### రేవంత్ సర్కార్ మరో గుడ్‌న్యూస్..

### ఈనెల 28 నుంచే ఖాతాల్లోకి

**హైదరాబాద్ డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** రేవంత్ రెడ్డి సర్కార్ మరో గుడ్ న్యూస్ వినిపించింది. ఇప్పటివరకు భూమి ఉన్న రైతులకు రుణమాఫీ చేసిన ప్రభుత్వం.. త్వరలోనే రైతు భరోసా కూడా ఇచ్చేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే.. అసలు భూమి లేకుండా కూలీ పనులు చేసుకుంటున్న రైతు కూలీలకు కూడా ఒక్కొక్కరికి రూ.12 వేలు ఇవ్వనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ప్రకటించారు. డిసెంబర్ 28వ తేదీ నుంచే మొదటి విడతగా అకౌంట్లలో డబ్బులు జమ చేయనున్నట్టు ప్రకటించారు. సంచలన నిర్ణయాలతో.. సంక్షేమ పథకాల అమలుతో దూసుకెళ్తున్న రేవంత్ రెడ్డి సర్కార్ మరో గుడ్ న్యూస్ వినిపించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. భూమిలేని పేద కూలీలకు అకౌంట్లలో ఏడాదికి రూ.12 వేలు ఇవ్వనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. ఈ హామీని ఈనెల 28వ తేదీ నుంచే అమలు చేయనున్నట్టు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అయితే.. ఈ రూ.12వేల రూపాయలను రెండు విడుతల్లో నిరుపేదల ఖాతాల్లో జమ చేయనున్నట్టు ..మిగతా 2లో

## వైసీపీ హయాంలో రాష్ట్రం తిరోగమనం

అమరజీవి ఆత్మార్పణ స్ఫూర్తితో సుపరిపాలన అందిస్తున్నాం

ఆత్మార్పణ దినం కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2



## ఒకే దేశం-ఎన్నిక బిల్లుపై

# కేంద్రం పునరాలోచన?

### పార్లమెంట్‌లో బిల్లు పెట్టేది అనుమానమే..!

**న్యూఢిల్లీ డిసెంబర్ 14 (నిఘా న్యూస్)** ఒకే దేశం-ఒకే ఎన్నికకు సంబంధించిన బిల్లుపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచనలో పడినట్లు తెలుస్తున్నది. వాస్తవానికి, సోమవారం పార్లమెంట్‌లో బిల్లులు ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రం ..మిగతా 2లో




## నేటి నుండి అసెంబ్లీ

# సమావేశాలు

### ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యేలకు సంతాపం తెలపనున్న శాసన సభ

### పలు బిల్లులపై ప్రతిపాదన

### పర్యటక విధానంపై స్వల్పకాలిక చర్చ



**హైదరాబాద్ డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర శాసన సభ సమావేశాలు రెండో రోజు నేటి (సోమవారం) నుండి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో ఇటీవల మృతి చెందిన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలకు శాసనసభ సంతాపాన్ని తెలపనున్నారు. కరీంనగర్ జిల్లా పూర్వ మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతిదేవి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య, మెదక్ జిల్లా పూర్వ దొమ్మాట మాజీ ఎమ్మెల్యే డి.రామచంద్రారెడ్డిలకు శాసన సభ సంతాపం తెలప నుంది. దీంతో పాటు రాష్ట్రంలో వ్యాయమ విద్యను బలోపేతం చేసేందుకు అలాగే క్రీడాకారులకి ప్రపంచస్థాయిలో ప్రతిభ కనపరిచి రాష్ట్రానికి పేరు తెచ్చేందుకు క్రీడా పాలసీ, క్రీడా యూని వర్సిటీ బిల్లును ప్రవేశపెట్టేందుకు, తెలంగాణ విశ్వవిద్యాలయ సవరణ బిల్లు ప్రవేశపెట్టేందుకు అనుమతి కోసం ప్రతిపాదించను న్నారు. అనంతరం రాష్ట్రంలో పర్యాటక విధానంపై స్వల్పకాలిక చర్చ ఉంటుందని శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు.


# మహారాష్ట్ర మంత్రివర్గ విస్తరణ

### 39 మందితో ప్రమాణస్వీకారం

### బీజేపీ -19 . షిండే శివసేన-11, ఎన్‌సీపీ నుంచి 9

**ముంబై, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** మహారాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరిగింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ సారథ్యంలోని 'మహాయుతి' ప్రభుత్వంలో కొత్తగా 37 మంది కేబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. బీజేపీ నుంచి 19 మంది, 11 మంది షిండే శివసేన నుంచి, ఏడుగురిని ఎన్‌సీపీ నుంచి మంత్రివర్గంలోకి తీసుకున్నారు. నాగపూర్‌లోని రాజ్‌భవన్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గవర్నర్ సీపీ రాధాకృష్ణ కొత్త మంత్రులతో ప్రమాణం చేయుంచారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. డిసెంబర్ 5న ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవిస్, ఉపముఖ్యమంత్రులుగా అజిత్ పవార్, ఏక్‌నాథ్ షిండే ప్రమాణం చేసిన విషయం విదితమే. అనంతరం తొలిసారి ఆదివారం మంత్రివర్గ విస్తరణ జరిగింది. బీజేపీ నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులే, రాధాకృష్ణ విఖే పాటిల్, ..మిగతా 2లో





## అయ్యప్ప భక్తుల బస్సును

# ఢీకొట్టిన కారు

### నవ దంపతులు సహా నలుగురు మృతి

2



## అసమర్థ రేవంత్ పాలనలో తెలంగాణ తిరోగమనం: కేటీఆర్

2

## కావాలని కొట్టలేదు..

# ఐయామ్ సారీ

జర్నలిస్టును పరామర్శించిన మోహన్‌బాబు

ఉద్దేశపూర్వకంగా మీడియా ప్రతినిధిని కొట్టలేదని మోహన్‌బాబు వివరణ

గాయపడిన రిపోర్టర్‌కు హాస్పిటల్‌లో క్షమాపణ చెప్పిన నటుడు మోహన్‌బాబు



2



## అసమర్థ రేవంత్ పాలనలో తెలంగాణ తిరోగమనం: కేటీఆర్

హైదరాబాద్ డిసెంబర్ 15 (నిఘా న్యూస్): పదేళ్ల పాటు కేసీఆర్ పాలనలో తెలంగాణ అద్భుతంగా పురోగమించిందని.. అనుభవరాహిత్యం, అసమర్థత, అవినీతి కలగలసిన రేవంత్ రెడ్డి పాలనలో నేడు అన్ని రంగాల్లో తిరోగమిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి రవాణా శాఖ ఆదాయం ఒక ముఖ్యమైన సూచీ అని.. ప్రజల ఆర్థిక పరిస్థితులు బాగుంటే బైకులు, కార్లే కాక ఇతర భారీ వాహనాల అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు వృద్ధిని చూపిస్తాయన్నారు. కానీ, తెలంగాణలో రిజిస్ట్రేషన్లు తగ్గి, ఆదాయం తిరోగమనంలో ఉందన్నారు. మన పొరుగున ఉన్న అయిదు రాష్ట్రాలు ఈ ఏడాది రవాణా శాఖ ఆదాయంలో 8 నుంచి 32శాతం వృద్ధిని నమోదు చేస్తే.. తెలంగాణ ఒక్కటే గత ఏడాది కంటే తక్కువ వృద్ధిని నమోదు చేయడం రాష్ట్రంలోని విఫల ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోందన్నారు. పాలన గాలికొదిలేసి కక్షసాధింపు చర్యలకే పూర్తి సమయం కేటాయిస్తే ఫలితాలు ఇలా కాక మరెలా ఉంటాయి? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా సర్కారు తీరుపై ఆయన మండిపడ్డారు.

## ఫలితాలు రానప్పుడు మాత్రమే.. ఈవీఎంలను ప్రశ్నించడం తప్పు: ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్): జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రానప్పుడు మాత్రమే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్స్ (ఈవీఎం)పై ప్రశ్నించడం తప్పని అన్నారు. ఓటింగ్ యంత్రాంగంపై నమ్మకం లేని పార్టీలు ఎన్నికల్లో పోటీ చేయకూడదని సూచించారు. ఈవీఎంలపై ఆరోపణలు చేస్తున్న 'ఇండియా' బ్లాక్ పార్టీలకు తన వ్యాఖ్యలతో షాక్ ఇచ్చారు. బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్‌కు డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష కూటమిలో భాగమైన ఒమర్ అబ్దుల్లా పీటీఐ వార్తా సంస్థకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఓటింగ్ పద్ధతిని ప్రశ్నించడంలో 'స్థిరంగా' ఉండాలని తెలిపారు. గెలిచినప్పుడు ఒక విధంగా, ఓడినప్పుడు మరో విధంగా మాట్లాడకూడదని హితవు పలికారు. కాగా, ఫలితాలు అంచనాలకు అందనప్పుడు మాత్రమే ఈవీఎంలను ప్రశ్నించడం తప్పు అని కాంగ్రెస్‌కు ఒమర్ అబ్దుల్లా చురక వేశారు. 'అవే ఈవీఎంలతో మీరు (కాంగ్రెస్) వంద మందికి పైగా పార్లమెంటు సభ్యులను పొందారు. మీ పార్టీ విజయంగా దానిని సెలబ్రేట్ చేసుకున్నారు. కొన్ని నెలల తర్వాత ఆశించిన విధంగా ఫలితాలు రానప్పుడు ఈవీఎంలకు వ్యతిరేకంగా మాట్లాడకూడదు. ఓటింగ్ యంత్రాంగంపై నమ్మకం లేని పార్టీలు ఎన్నికల్లో పోటీ చేయకూడదు' అని అన్నారు. మరోవైపు ఓటర్లు ఒకసారి ఎన్నుకుంటారని, మరోసారి ఎన్నుకోరని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. దీనికి తానే ఉదాహరణ అని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిన తాను అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచినట్లు చెప్పారు. అయితే తాను ఎప్పుడూ కూడా ఈవీఎంలను నిందించలేదని అన్నారు.

## తబలా వాయిద్య కారుడు జకీర్ హుస్సేన్ కన్నుమూత



న్యూఢిల్లీ డిసెంబర్ 14 (నిఘా న్యూస్) తబలా వాయిద్య కారుడు జకీర్ హుస్సేన్ (73) ఆదివారం కన్నుమూశారు. అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో లో గల ఓ దవాఖాన ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో గుండె సంబంధ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించారు. బీపీతో జకీర్ హుస్సేన్ బాధ పడుతున్నారని ఆయన మేనేజర్ తెలిపారు. ప్రముఖ తబలా వాయిద్యా కారుడు ఉస్తాద్ అల్లా రఖా పెద్ద కుమారుడే జకీర్ హుస్సేన్. తబలా వాయిద్యంలో తండ్రి వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లిన జకీర్ హుస్సేన్.. దానికి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకు వచ్చారు. వారం రోజులుగా జకీర్ హుస్సేన్ గుండె సంబంధ ఆరోగ్య సమస్యలతో శాన్ ఫ్రాన్సిస్కో లోని దవాఖానలో చికిత్స పొందుతున్నారు. పలు ప్రతిష్ఠాత్మక అవార్డులను ఆయన సొంతం చేసుకున్నారు. 1988లోనే పద్మ శ్రీ, 2002లో పద్మ భూషణ్, 2023లో పద్మ విభూషణ్ అవార్డులను గెలుచుకున్నారు. సంగీత నాటక్ అకాడమీ అవార్డుతోపాటు రెండు సార్లు ప్రతిష్ఠాత్మక గ్రామీ అవార్డును సొంతం చేసుకున్నారు. 1951 మార్చి తొమ్మిదో తేదీన మహారాష్ట్రలోని ముంబైలో జకీర్ హుస్సేన్ జన్మించారు. కథక్ నృత్యకారణి, తన మేనేజర్ అంటోనియా మిన్నెకొలాను పెండ్లి చేసుకున్నారు. ఆయనకు ఇద్దరు కూతుళ్లు – అనిషా ఖురేషి, ఇసాబెల్లా ఖురేషీ ఉన్నారు. యూసీఎల్ఏలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అనిషా ఒక సినిమా నిర్మాతగా ఉన్నారు. మాన్ హట్టన్ లోని ఇసాబెల్లా నృత్యవిద్యనభ్యసించారు.

## అయ్యప్ప భక్తుల బస్సును ఢీకొట్టిన కారు

### నవ దంపతులు సహా నలుగురు మృతి

తిరువనంతపురం, డిసెంబర్ 14 (నిఘా న్యూస్) కేరళలో తీవ్ర విషాదం నెలకొంది. పెళ్లయిన 15 రోజులకే రోడ్డు ప్రమాదంలో నవ వధూవరులు దుర్మరణం చెందారు. శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప భక్తుల బస్సును కారు ఢీకొట్టడంతో నవ దంపతులు సహా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. కేరళలోని పథానంతిట్టకు చెందిన అను, నిఖిల్‌కు 15 రోజుల కిందట వివాహమైంది. పెళ్లి తర్వాత హనీమూన్‌కు మలేసియాకు వెళ్లి ఇవాళ తిరిగి కేరళకు వచ్చారు. ఈ క్రమంలో తిరువనంతపురంలో కొత్త దంపతులను రిసీవ్ చేసుకోవడానికి నిఖిల్ తండ్రి మథాయ్ ఈపన్, అను తండ్రి జార్జ్ బిజులు వెళ్లారు. వారంతా కారులో బయల్దేరి సొంతూరికి వెళ్తుండగా ఆదివారం ఉదయం 4.05 గంటల ప్రాంతంలో పనలూరు–మువట్టుపుజ రహదారిపై పథానంతిట్ట జిల్లా మురింజకల్ వద్ద ప్రమాదం జరిగింది. తెలంగాణకు చెందిన అయ్యప్ప భక్తులు వెళ్తున్న బస్సును కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో నిఖిల్, జార్జ్ బిజు, ఈపన్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అను మృతి చెందింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ సహా పలువురు అయ్యప్ప భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం గురించి తెలియగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జవ్వడంతో హైడ్రాలిక్ సాయంతో మృతదేహాలను బయటకు తీశారు. కారు డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

# భూమిలేని నిరుపేదలకు రూ.12 వేలు

మొదటి పేజీ తరువాయి...

తెలిపిన భట్టి.. మొదటి విడత డబ్బులను 28వ తారీఖునే జమ చేయనున్నట్టు వెల్లడించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ మేరకు ప్రకటన చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం 1885లో డిసెంబర్ 28న కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని భట్టి విక్రమార్క తెలిపారు. దేశంలోని నిరుపేదల సంక్షేమం గురించి ఆలోచించే పార్టీ కాంగ్రెస్ కాబట్టి.. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం రోజైన డిసెంబరు 28 నుంచే.. నిరుపేద కూలీలకు మొదటి విడత డబ్బులు రూ.6 వేలు వారి వారి ఖాతాల్లో జమ చేయనున్నట్టు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇదిలా ఉంటే.. కొత్త సంవత్సరంలో సంక్రాంతి పండుగ నుంచే అన్నదాతలకు రైతు భరోసా డబ్బులు అందజేస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మరోవైపు.. ఇప్పటికే సన్న వడ్లకు క్వింటాకు ఇస్తున్న రూ.500 బోనస్ ద్వారా ప్రతి



ఏకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అదనంగా రైతులు లబ్ది పొందుతున్నారని భట్టి వివరించారు. ప్రజా ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తోందని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏడాది పాలనలో వ్యవసాయానికి, రైతుల కోసం నేరుగా రూ.50,953 కోట్లు ఖర్చు చేసిందని భట్టి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమల విస్తరణ కోసం రేవంత్ రెడ్డి సర్కార్.. కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్, వరంగల్ ప్రాంతాల్లో కొత్తగా ఎయిర్ పోర్టులు ఏర్పాటు చేయనుందని భట్టి విక్రమార్క వివరించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు తలమానికంగా మూసీని అభివృద్ధి చేసేందుకే.. మూసీ పునరుజ్జీవ కార్యక్రమం చేపట్టామని భట్టి విక్రమార్క వివరించారు. మరోవైపు.. అన్ని జిల్లాలను కలుపుతూ రీజినల్ రింగ్‌రోడ్ ఏర్పాటు చేయనున్నట్టు భట్టి విక్రమార్క వివరించారు. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ మధ్య ఇండస్ట్రియల్, హౌసింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేసి భవిష్యత్ తరాలకు అందించబోతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర అప్పులపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు పచ్చి అబద్ధాలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. మరోవైపు.. ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలపై భట్టి విక్రమార్క విమర్శలు గుప్పించారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కోసం ఏమీ చేయలేదని ఆరోపించారు.. ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు భ్రమలు కల్పించి.. రాష్ట్ర ప్రజలను మోసం చేయటమే బీఆర్ఎస్ నేతలకు తెలుసని భట్టి విమర్శించారు.

# వైసీపీ హయాంలో రాష్ట్రం తిరోగమనం

అమరావతి, డిసెంబర్ 15 (నిఘా న్యూస్): మేం ప్రారంభించిన అభివృద్ధిని గత ప్రభుత్వం పక్కన పెట్టింది. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమనం వైపు నడిపించింది. అమరావతిని, పోలవరాన్ని గత ప్రభుత్వం నాశనం చేసింది. 2019లో నెత్తిన చెయ్యిపెట్టి.. ఆస్తులే రాయించుకునే పరిస్థితి తెచ్చారు. గత ఐదేళ్లు ఇంత స్వేచ్ఛ ఉండేదా? గత ప్రభుత్వంలో అనుభవించిన నరకాన్ని ప్రజలు గుర్తు పెట్టుకోవాలి. కేంద్రంలో మన పరపతి పెరగడం వల్ల.. రాష్ట్రానికి మంచి జరుగుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అదేవిధంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సమాజమే తమ లక్ష్యమన్నారు. పొట్టి శ్రీరాములు అమరజీవిగా ఖ్యాతి పొందారన్నారు. సంకల్ప సిద్ధి కోసం ప్రాణత్యాగం చేసిన ఏకైక వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన ఆత్మార్పణం భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి దోహదం చేసిందన్నారు. ఆయన ప్రాణ త్యాగం తర్వాత తెలుగు రాష్ట్రం ఏర్పడిందన్నారు. పొట్టి శ్రీరాములు స్ఫూర్తిని రాష్ట్రం మొత్తం నింపాలని పవన్ చెప్పారు. నెల్లూరు జిల్లాను పొట్టి శ్రీరాములు జిల్లాగా పేరు మార్చాను. త్వరలో పొట్టి శ్రీరాములు పేరుతో ఏపీలో తెలుగు వర్సిటీ ఏర్పాటు చేస్తాం. పొట్టి శ్రీరాములు సొంతూర్లో అభివృద్ధి కార్యక్రమాలు తలపెట్టాం. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల స్ఫూర్తితో సుపరిపాలన అందిస్తున్నాంసుస్థిర ప్రభుత్వంతోనే నిరంతర సంక్షేమం, అభివృద్ధి సాధ్యం. ప్రతిరోజూ ఓ ముఖ్యమైనదే అయినా ఈరోజుకు ఓ ప్రత్యేకత ఉంది. తెలుగు ప్రజలు గర్వంగా చెప్పుకునే ఓ వ్యక్తి పొట్టి శ్రీరాములు . చాలాకొద్ది మందే జాతికోసం ఆలోచిస్తారు. ఇదేకోవలో తెలుగు జాతి కోసం ఆలోచించి, ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని సాధించిన వ్యక్తి. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేసి మధ్యాహ్నం భోజనం చేయకపోతేనే తట్టుకోలేం.. అలాంటిది 58 రోజులపాటు నిరాహార దీక్ష చేసి, భయంకర పరిస్థితుల మధ్య సంకల్ప సిద్ధికోసం త్యాగం చేసిన ఏకైక నాయకుడు పొట్టి శ్రీరాములు .అందుకే ఆయన అమరజీవి అయ్యారు.. ఓ వ్యక్తి త్యాగం భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణమైంది. ఇలాంటి నాయకులను శాశ్వతంగా గుర్తుంచుకోవాల్సిన అవసరముందని భావించి.. ఈ స్ఫూర్తిని రాష్ట్రం మొత్తంమీద వ్యాపిచేయాల్సిన బాధ్యత ఉందని మొట్టమొదట చెప్పిన వ్యక్తి పవన్ కళ్యాణ్. తెలుగుజాతి కోసం ప్రాణాలర్పించిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అయితే దేశాన్ని ఐకమత్యంగా ఉంచేందుకు పోరాడిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని సీఎం చంద్రబాబు కొనియాడారు. తెలుగుజాతి అనేకసార్లు చాలా ఇబ్బందులు పడింది. ఒకప్పుడు ఏ పనికావాలన్నా మద్రాస్ వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. మొట్టమొదటిగా గుంటూరులో యువజన నవ్య సాహితీ సమితి ఏర్పడింది. ఆ తర్వాత వివిధ రూపాల్లో దాదాపు 50 ఏళ్ల పోరాటం తర్వాత, పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసిన తర్వాత 1953లో తెలుగు రాష్ట్రం వచ్చింది. 1912లో గుంటూరు, కృష్ణా, గోదావరి జిల్లాల్లో సంయుక్త సదస్సు ఏర్పాటు చేశారు. నిడదవోలులో పెద్ద సమావేశం పెట్టారు. తెలుగుజాతికి ఒక రాష్ట్రం కావాలని గట్టిగా అడిగారు. 1913లో ఆంధ్ర మహాసభ పెట్టి బాపట్లలో నినదించారు. పట్టాభి సీతారామయ్య ఒక మాట అన్నారు.. మనకు తమిళ మంత్రులు ప్రత్యేక రాష్ట్రం ఇచ్చేలోపే బ్రిటిష్‌వారే స్వాతంత్ర్యం ఇస్తారని... చివరికి అదే జరిగింది. 1948 మార్చిలో నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విశాఖకు రాగా ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం నిరసన వ్యక్తం చేస్తే.. అదే ఏడాది జూన్ 17న ధార్ కమిషన్ వేశారు. ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్రం అవసరం లేదని ఆ కమిషన్ నివేదిక ఇచ్చింది. ఇలా రకరకాల సమస్యలు ఎదురయ్యాయి. చివరికి పొట్టి శ్రీరాములు త్యాగం ఫలితంగా తెలుగు జాతికి ప్రత్యేక రాష్ట్రం వచ్చింది. ఆయన 1901, మార్చి 16న ఆనాటి మద్రాస్ ప్రెసిడెన్సీలోని పడమటిపల్లిలో జన్మించారు. స్వాతంత్ర్యంతోపాటు సామాజిక ఉద్యమాల్లో పాల్గొని, షెడ్యూల్డు కులాల హక్కుల కోసం కూడా పోరాడిన సామాజిక వాది, మానవతా వాది. పొట్టి శ్రీరాములు త్యాగం, కొందరు రాజకీయ నాయకుల రాజీనామాలతో ఉద్యమం తీవ్రమై చివరకు 1952, డిసెంబర్ 19న ఆనాటి ప్రధాని నెహ్రూ దిగొచ్చి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇదీ చరిత్ర. ఆ తర్వాత రాజధాని ఏదనే దానిపై గందరగోళం తలెత్తింది. ప్రకాశం పంతులు వంటివారు ఆలోచన చేసి కర్నూలు రాజధానిగా గుంటూరులో హైకోర్టు ఏర్పాటు చేస్తామని చెప్పి శ్రీబాగ్ ఒప్పందం చేసుకున్నారు. ఇలా తాత్కాలికంగా నిర్ణయం తీసుకొని ముందుకెళ్లారు. ఆ తర్వాత 11 జిల్లాలతో రాష్ట్రం ఏర్పాటు బిల్లు 1953, ఆగస్టు 10న పార్లమెంటు ఆమోదించింది. తర్వాత 13 జిల్లాలు అయ్యాయి. 1953, అక్టోబర్ 1న కర్నూలు రాజధానిగా పాలన ప్రారంభమైంది. 1956, ఫిబ్రవరి 1న ఆనాటి ఉప ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి అసెంబ్లీలో విశాలాంధ్ర తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 1956, నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడి.. మొదటి ముఖ్యమంత్రిగా నీలం సంజీవరెడ్డి ప్రమాణం చేశారు. తర్వాతికాలంలో 1969లో తెలంగాణ రాష్ట్ర ఉద్యమం, ఆపై ఇక్కడ జై ఆంధ్రా ఉద్యమం జరగడం.. ఇలా అనేక ఉద్యమాలు జరిగాయి. తెలుగువారంతా ఒకటే అని ఎన్టీ రామారావు ముందుకెళ్లారు. తొలిసారిగా తెలుగువారందరినీ గుర్తుంచుకునేలా హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్‌పై విగ్రహాలు పెట్టారు. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకుంటూ ఆయన పేరుతో తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. నేను వచ్చాక నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు జిల్లాగా నామకరణం చేశామని సీఎం చంద్రబాబు వివరించారు. పొట్టి శ్రీరాములు పుట్టిన ఊర్లో పెద్దఎత్తున కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని, నీరు ఇవ్వడంతో పాటు వంతెన వేయాలని, హైస్కూల్ అభివృద్ధి చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసి.. పద్ధతి ప్రకారం అన్ని పనులూ చేసి ఒక మెమోరియల్ ఏర్పాటుకు ముందుకెళ్తే దాన్ని కూడా తర్వాత వచ్చిన ప్రభుత్వం క్యాన్సిల్ చేసే పరిస్థితికి వచ్చారని వెల్లడించారు. మహనీయులు చేసిన త్యాగాలను గుర్తుపెట్టుకావాల్సిన అవసరం ప్రతిఒక్కరికీ ఉందన్న ఆలోచనతోనే ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మహనీయుల పోరాట స్ఫూర్తిని, ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత రాష్ట్రంలోని అయిదు కోట్ల 50 లక్షల మందిపైనా ఉందన్నారు. ఆర్థిక సంస్కరణలు చేసి దేశానికి దశ దిశను చూపించిన ఏకైక వ్యక్తి తెలుగుబిడ్డ పీవీ నరసింహారావు . ఇలాంటి గొప్పవారి త్యాగాలందరినీ గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ప్రాంతీయ పార్టీ పెట్టినా.. దేశాభివృద్ధి దృక్పథంతో ముందుకెళ్లిన వ్యక్తి ఎన్టీ రామారావు అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

### వెలుగులు నింపేందుకే స్వర్ణాంధ్ర ఏ 2047

మహనీయుల స్ఫూర్తితోనే స్వర్ణాంధ్ర ఏ 2047 తీసుకొచ్చామని, దీన్ని ఒక వ్యక్తికోసమో, ఒక కులంకోసమో, మతం కోసమో, కుటుంబం కోసమో కాదు.. రాష్ట్రంలోని ప్రతివ్యక్తి, ప్రతి కుటుంబం, ప్రతి ప్రాంతం కోసం ఏమి చేయబోతామనేది చాలా స్పష్టంగా విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరిచామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను పొందుపరిచా మన్నారు. కొందరు నాయకులు త్యాగాలు చేశారు.. మరికొందరు రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారు.. మరికొందరు దేశాన్ని అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేశారు. జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆలోచించారు. కొందరు మాత్రం తమ స్వార్థం కోసం దేశాన్ని, రాష్ట్రాన్ని నాశనం చేశారు. ఇలా స్వేచ్ఛగా మాట్లాడుకునే పరిస్థితి లేకుండా చేశారు. పొట్టి శ్రీరాములు పుట్టిన ఊర్లో అభివృద్ధి కార్యక్రమాలన్నింటినీ రద్దు చేశారు. చేయాల్సిందంతా చేసి ఇప్పుడు ప్రేమ ఒలకబోస్తున్నారు. 2014లో విభజన జరిగిన తర్వాత 13.5 శాతం వృద్ధి రేటు సాధించాం. ఎవరికీ ఏ కష్టం లేకుండా చేశాం. 2019లో వచ్చిన ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా అమరావతిపై కక్షకట్టి విధ్వంసం చేశారు. పోలవరంను కూడా నాశనం చేసి రాష్ట్రాన్ని తిరోగమనం వైపు నడిపించారు. తిరిగి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఆర్నెల్లుగా కష్టపడుతున్నాం. మహనీయుల స్ఫూర్తి ఇచ్చిన దృఢ సంకల్పమే మమ్మల్ని ముందుకు తీసుకెళ్తోంది. వెల్తీ, హెల్తీ, హ్యాపీ సొసైటీ లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు.

# మహారాష్ట్ర మంత్రివర్గ విస్తరణ

మొదటి పేజీ తరువాయి...

ఆశిష్ షెలార్, చంద్రకాంత్ పాటిల్, గిరీష్ మహాజన్, గణేష్ నాయక్, మంగళ్ ప్రతాప్ లోథా, జయకుమార్ రావల్, పంకజ ముండే, అతుల్ సావే మంత్రులుగా ప్రమాణస్వీకారం నుంచి. కాగా, షిండే శివసేన నుంచి దాదా భుసే, శంభురాజ్ దేశాయ్, సంజయ్ రాథోడ్, గులాబ్‌రావు పాటిల్, ఉదయ్ సామంత్ ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఉన్నారు. అజిత్ పవార్ ఎన్‌సీపీ నుంచి మాణిక్రావు కోకటే, దత్తాత్రేయ్ విఠోభా భర్నే, హసన్ ముష్రిఫ్, అదితి సునీల్ టట్కరే, ధనంజయ్ ముండే ప్రమాణస్వీకారం చేశారు. 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో మహాయుతి కూటమి 230 స్థానాలను కైవసం చేసుకుని మరోసారి అధికార పగ్గాలు చేపట్టింది. కేబినెట్ విస్తరణలో భాగంగా 37 మందికి చోటు కల్పించగా. మహా క్యాబినెట్‌లో గరిష్టంగా 43 మందిని తీసుకునే అవకాశం ఉంటుంది. త్వరలో మిగిలిన వారిని కూడా తీసుకోనున్నారు.

# పదేళ్ల బీఆర్ఎస్ పాలనతోనే తెలంగాణ వెనకబాటు

మొదటి పేజీ తరువాయి...

చెప్పి, తిమ్మిని బమ్మిని చేసి కేసీఆర్ సీఎం కుర్చీలో కూర్చున్నారని ఆరోపించారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో ఉద్యమించి, మాయమాటలతో పీఠమెక్కిన కేసీఆర్ అన్యాయంతో పాలన సాగించారని విమర్శించారు. ఉద్యమంలో కవులు, కళాకారులు, మేధావులు, విద్యావేత్తలు, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు ఇలా సబ్బండ వర్గాలు ప్రాణాలకు తెగించి పోరాడితే చివరకు కేసీఆర్ రాష్ట్రాన్ని తమ కుటుంబ సభ్యుల కబంధ హస్తాల్లో బంధించి భ్రష్టు పట్టించారని ఆరోపించారు. బీఆర్ఎస్ పెత్తందారి సర్కార్ వల్ల విసిగిపోయిన ప్రజలు ఆ పాలనకు చరమగీతం పాడారని విమర్శించారు. అయినా కల్వకుంట్ల కుటుంబ సభ్యుల్లో కానీ, ఆ పార్టీ నేతల్లో కానీ ఎలాంటి మార్పు రాలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ అసత్యాల ప్రచారం : తెలంగాణ ఏర్పాటుకు సబ్బండ వర్గాలు పోరాడగా, సోనియా గాంధీ రాష్ట్రాన్ని ఇచ్చినట్లు విశ్వసించి ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని వివరించారు. ప్రజలు తమకు అధికారం కట్టబెడితే ఓర్వలేక బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు, ఆ పార్టీ నేతలు అసత్యాలను ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇదే పంథాలో సాగితే మీకు తగిన సమయంలో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. మూసీ పునరుజ్జీవనం కోసం అవినీతి జరిగిందని కేటీఆర్ గగ్గోలు పెడుతున్నారని ఆరోపించిన మహేశ్ కుమార్ గౌడ్, ఆ ప్రాజెక్టు డీపీఆర్ కోసం కేవలం రూ.150 కోట్లు ఖర్చు చేశామని, అంతకు మించి రూపాయి కూడా అదనంగా వ్యయం చేయలేదన్న వాస్తవాన్ని కేసీఆర్ గ్రహించాలన్నారు.

అందె శ్రీపై కక్ష : జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం గీత రచయిత అందె శ్రీపై మీరు కక్ష గట్టి అవమానించారని, పదేళ్లు అధికారిక గీతం లేకుండా వ్యవహరించినట్లు ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం గీతాన్ని అధికారికంగా ప్రకటించడంతో పాటు ఆ రచయితను గౌరవించుకోవడం తాము గర్వంగా భావిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు అవాకులు చెవాకులు పేల్చడం మానుకునేలా కేసీఆర్ చూస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.



## ఒకే దేశం-ఎన్నిక బిల్లుపై కేంద్రం పునరాలోచన?

మొదటి పేజీ తరువాయి...

ప్రకటించింది. ఈ క్రమంలో రాజ్యాంగం (129వ సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంత చట్టాల (సవరణ) బిల్లులను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు జాబితా చేసింది. తాజాగా సవరించిన లోక్‌సభ బిజినెస్ జాబితాలో సోమవారం నాటి ఎజెండాలో ఈ రెండు బిల్లులను తొలగించింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 20న ముగియనున్నారు. గురువారం కేబినెట్ రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు- 2024, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాలు (సవరణ బిల్లు), 2024కి ఆమోద ముద్ర వేసింది. ఆ తర్వాత శుక్రవారం సాయంత్రం బిల్లులకు సంబంధించిన ప్రతులను సభ్యులకు పంపిణీ పూర్తయ్యింది. ఈ క్రమంలో కేంద్రం బిల్లులను ప్రవేశపెడుతుందా? లేదా? అన్నది చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి జమిలీ ఎన్నికల కోసం రాజ్యాంగంలో కొత్తగా 82ఎ అధికరణను చేర్చాల్సి రానున్నది. పార్లమెంట్ పదవీకాలంలో మార్పు కోసం 83 అధికరణ, అసెంబ్లీ పదవీకాలం సవరణ కోసం 327 అధికరణను సవరించాల్సి ఉంటుంది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ సిఫారసుల మేరకు రాజ్యాంగ (129వ సవరణ) బిల్లును కేంద్రం రూపొందించిన విషయం తెలిసిందే. ముసాయిదా బిల్లుల ప్రకారం సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్‌సభ మొదటి సమావేశానికి రాష్ట్రపతి నోటిఫై చేసిన తేదీ నుంచి ఏకకాల ఎన్నికలు అమలులోకి వస్తాయి. రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం.. ఈ నియమిత తేదీ తర్వాత ఎన్నికైన అన్ని రాష్ట్రాల అసెంబ్లీల పదవీ కాలాలు, లోక్‌సభ పూర్తికాల వ్యవధితో పాటు ముగిసేలా తగ్గిస్తారు. తద్వారా ఏకకాల ఎన్నికలకు మార్గం సుగమమవుతుంది. 2024 లోక్‌సభకు సంబంధించి మొదటి సమావేశం ముగిసిందున.. తదుపరి లోక్‌సభ ఎన్నికలు 2029లో జరుగుతాయి. ఆ లోక్‌సభ తొలి సమావేశంలో రాష్ట్రపతి నోటిఫై చేస్తే.. ఆ లోక్‌సభ పూర్తి పదవీ కాలం ఉంటే 2034లో తొలి విడత జమిలీ ఎన్నికలు జరుగుతాయి. బిల్లు ప్రకారం అసెంబ్లీలకు ఉన్న నిబంధనలు కేంద్ర పాలిత ప్రాంతాలైన ఢిల్లీ, జమ్మూ కశ్మీర్, పుదుచ్చేరికి వర్తిస్తాయి. కొత్త జమిలి ఎన్నికల బిల్లు ప్రకారం నిర్దేశిత కాల పరిమితి కన్నా ముందే పార్లమెంట్, రాష్ట్ర, యూటీల అసెంబ్లీలు రద్దయితే, ఆయా అసెంబ్లీలకు, పార్లమెంట్‌కు మిగిలి ఉన్న కాలానికి మాత్రమే మధ్యంతర ఎన్నికలు జరుగుతాయి.

## 'కావాలని కొట్టలేదు- ఐయామ్ సారీ'

హైదరాబాద్ డిసెంబర్ 15 (నిఘా న్యూస్): హైదరాబాద్ శివారు ప్రాంతం జల్‌పల్లిలోని తన నివాసం వద్ద జరిగిన ఘటనపై మంచు మోహన్ బాబు తాజాగా స్పందించారు. తాను ఉద్దేశ పూర్వకంగా ఓ మీడియా ప్రతినిధిని కొట్టలేదని స్పష్టతను ఇచ్చారు. జర్నలిస్టులకు హృదయపూర్వకంగా క్షమాపణలు చెప్పారు. ఆదివారం (డిసెంబరు 15) సాయంత్రం సోమాజిగూడలోని యశోదా ఆసుపత్రికి స్వయంగా వెళ్లి చికిత్స పొందుతున్న జర్నలిస్టు రంజిత్‌ను మోహన్ బాబు, మంచు విష్ణుతో పాటు కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా అతని కుటుంబ సభ్యులకు బహిరంగంగా ఆయన క్షమాపణలు చెప్పారు. హైదరాబాద్‌లోని జల్‌పల్లిలో సినీనటుడు మోహన్ బాబు ఇంటి వద్ద మంగళవారం (డిసెంబరు 10న) రాత్రి ఉద్రిక్తత చోటుచేసుకున్న విషయం అందరికీ తెలిసిందే. తెలంగాణ అదనపు డీజీపీ మహేశ్ భగవత్‌ను కలిసిన అనంతరం మనోజ్ మోహన్ బాబు నివాసానికి చేరుకోగా, సెక్యూరిటీ సిబ్బంది ఆయనను అడ్డుకున్నారు. గేట్లు తీయకుండా మంచు మనోజ్‌ను అక్కడి భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గేట్లు బద్దలు కొట్టుకుని లోపలికి దూసుకెళ్లారు. మీడియాపై చేయి చేసుకున్న మోహన్‌బాబు : ఆయనతో పాటు అక్కడ ఉన్న జర్నలిస్టులు, మీడియా సిబ్బంది కూడా మోహన్ బాబు ఇంట్లోకి వెళ్లారు. ఈ ఉద్రిక్తతల నడుమ మోహన్‌బాబు తీవ్ర అసంతృప్తి, కోపానికి గురయ్యారు. అక్కడే ఉన్న మీడియా ప్రతినిధులపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వెంటనే కొందరు మీడియా ప్రతినిధులపై ఆయన పొరపాటున చేయి చేసుకున్నారు. దీంతో ఆ జర్నలిస్ట్‌కు ముఖంపై తీవ్ర గాయమైంది. వైద్యులు ఆయనకు శస్త్ర చికిత్స చేసి అబ్జర్వేషన్‌లో పెట్టారు. జర్నలిస్టుపై నటుడు మోహన్‌బాబు దాడి చేయడం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపింది. ప్రజలందరి చూపు ఒక్కసారిగా మోహన్‌బాబు ఫ్యామిలీపై పడింది. కుటుంబ అంతర్గత వివాదాలతో మోహన్‌బాబు ఆయన చిన్న కుమారుడు మంచు మనోజ్ సతమతమయ్యారు. దీనికి కారణంగా బహిరంగంగా ఓ ఆడియో సందేశాన్ని కూడా విడుదల చేశారు. దాడి ఘటనతో మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదైంది. వెంటనే హైకోర్టులో మోహన్‌బాబు తరపు లాయర్ ఆయనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.





నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం లోని పడమటి ఆంజనేయస్వామిని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి ఆదివారం దర్శించుకున్నారు. పడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం జరిగే రథోత్సవ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరు కాగా, మక్తల్ మినీ ట్యాంక్ బండ్ వద్ద జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి.

*-నారాయణపేట, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):*

## విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం లో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి



**హబ్సిగూడ, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** హబ్సిగూడ సాయిసుక విస్టా అపార్ట్ మెంట్స్ లో దత్తాత్రేయ, సాయిబాబు, గణేష్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం లో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు..సాయి సుక్క విష్ట అపార్ట్మెంట్ వాసులు ప్రదీప్, దిలీప్, సురేష్, శివా రెడ్డి, శివశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విగ్రప్రతిష్ఠ కార్యక్రమం లో స్వామి వారిని దర్శించుకొని మందముల పరమేశ్వర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విగ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయు ఆరోగ్యాలు మరియు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని వారు కోరుకున్నట్లు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుధాకర్ రెడ్డి, గణేష్ నాయక్, ఆకారపు అరుణ్, ఉపేందర్ రెడ్డి, శివ, రాజన్న, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



ఈనెల 18వ తేదీ బుధవారం సాయంత్రం నల్లకుంట లోని తన ఇంటి వద్ద నిర్వహిస్తున్న శ్రీ హరి హరపుత్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజకు రావాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దూసరి శ్రీనివాస్ గౌడ్ ఆదివారం మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పడిపూజకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని దూసరి ఆయనకు అందజేశారు.


*-అంబర్ పేట, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):*

## ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తి పట్టణంలో శ్రీ వాసవి పరమేశ్వరి అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులచే పొట్టి శ్రీరాములు నివాళులు అర్పించే కార్యక్రమం జరిగినది. సదరు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాకచర్ల గురప్ప శెట్టి, పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొని పొట్టి శ్రీరాములు నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు చేసిన ఆమరణ దీక్ష, త్యాగ ఫలితంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ జరిగిన విధానంను ముఖ్య అతిథులు గురప్ప శెట్టి చక్కగా వివరించారు. అటువంటి పొట్టి శ్రీరాములు వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించినందుకుగాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బజారు వీధి, శ్రీవాసవి కన్యకా పరమేశ్వర దేవస్థానం పాలక మండలి సభ్యులు పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## మల్లన్న జాతరలో పీసీసీ సభ్యుడి పూజలు



**నిజాంపేట్ , డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** నిజంపేట్ మండల్ నాగదర్ గ్రామ శివారులో మల్లన్న స్వామి ఉత్సవాలు సందర్భంగా పీసీసీ సభ్యులు కే శ్రీనివాస్ పాల్గొని మల్లన్న స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ నియోజికవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు సాయిలు మంచేందర్ బక్షిరాం శివకుమార్, కొండల్ రెడ్డి తదితరులు హాజరైనారు.

# ప్రశాంతంగా గ్రూప్ 2 పరీక్షలు

**ఘట్ కేసర్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** గ్రూప్-2 పరిక్ష నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పోట్రు హెచ్చరించారు. ఘట్ కేసర్ మండలంలో గ్రూప్-2 పరిక్ష జరుగుతున్న అంకుషాపూర్ లోని ఏసీ ఇంజనీరింగ్ కళాశాల, ఎదులాబాద్ లోని మేఘా మహిళా ఇంజనీరింగ్ కళాశాలలను కలెక్టర్ గౌతం ఆదివారం సందర్శించి తనిఖీ చేశారు. పరిక్ష ప్రశాంతంగా జరుగుతుందా, సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరిక్షా గదులలో తిరిగి పరిక్ష నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పరిక్ష నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రతి ఒక్కరు ని,రంతరం అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలన్నారు. ఏలాంటి ఆవంచనీయ సంఘటనలు జరిగినా చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. గ్రూప్-2 పరీక్షకు 2750 మంది అభ్యర్థులు హజరు ఘట్ కేసర్ మున్సిపాలిటీ పరిధి కొండాపూర్ లోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల, అవుషాపూర్ లోని వీబీఐటీ కళాశాల, అరోరా ఇంజనీరింగ్ కళాశాల ఘనపూర్ లోని కేపీఆర్ఐటీ కళాశాల, ఎదులాబాద్ లోని మెగా మహిళా ఇంజనీరింగ్ కళాశాల, అంకుషాపూర్ లోని ఏసీ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రూప్-2 పరీక్షలు జరిగాయి. మొత్తం 6238



అభ్యర్థులకు గాను 3488 మంది గైర్హాజర్ కాగ 2750 మంది అభ్యర్థులు పరిక్షకు హాజరు అయ్యారు. గ్రూప్-2 పరీక్ష సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కళాశాలల వద్ద 144 సెక్షన్ విధించారు. పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించిన తర్వాతనే అభ్యర్థులను లోపలకి పంపించారు. ఇతరులేవరిని పరిసరాలకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, ఘట్కేసర్ ఇన్స్పెక్టర్ పరశురాం పర్యవేక్షించారు. ఎస్సైలు ప్రభాకర్ రెడ్డి, నర్సింహ్మ, శ్రీకాంత్, శేఖర్ తదితరులు బందోబస్తులో పాల్గొన్నారు.

# బ్రిడ్జి సాధన ఉద్యమానికి ఆర్యవైశ్యుల మద్దతు

**ఘట్ కేసర్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** ఘట్ కేసర్ పట్టణంలో పెండింగ్ లో ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలకు ఆర్యవైశ్య సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర నాయకులు బురుగు చంద్రశేఖర్ గుప్తా, జిల్లా నాయకులు రవ్వ శరత్ గుప్తాలు తెలిపారు. ఘట్ కేసర్ పట్టణంలో జేఏసీ కన్వీనర్ మారం లక్మారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరహార దీక్షలో మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు బచ్చు మమత, మండల మహిళా అధ్యక్షురాలు బురుగు మేఘమాల, కోశాధికారి రవ్వ నవనీత, ఉడుత బిందులు కూర్చున్నారు. వారికి బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, మండల రైతు సేవా సహకార సంఘం చైర్మన్ రాంరెడ్డి,



మాజీ చైర్మన్ సార శ్రీనివాస్ గౌడ్, డైరెక్టర్ రేసు లక్ష్మా రెడ్డి, కౌన్సిలర్ బండారి అంజనేయులు గౌడ్, మాజీ ఎంపీటీసీ మేకల నర్సింగ్ రావు, గోపాల్ రెడ్డి, రిటైర్డ్ హెడ్ మాస్టర్ బచ్చు మారయ్య, న్యాయవాది చంద్రశేఖర్ గౌడ్, బచ్చు నాగేష్ లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ గుప్తా మాట్లాడుతు బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చేస్తున్న దీక్షకు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు మద్దతు పలకాలన్నారు. రాజకీయాలు వద్దు, బ్రిడ్జి నిర్మాణమే ముద్దు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు ఎం డీ సిరాజ్, కమలాకర్, బచ్చు నగేష్ గుప్తా, ప్రమోద్ గుప్తా, చిన్న శ్రీనివాస్ గౌడ్, ముల్గురం జంగయ్య, రోడ్డ యాదగిరి, అర్జున్, అశోక్ గౌడ్, శ్రావణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికలు తప్పనిసరిగా కరాటే నేర్చుకోవాలి

**ఘట్ కేసర్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** కరాటే విద్య ఆడపిల్లలకు జీవితంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సాయి గురుకుల్ స్కూల్ ప్రిన్సిపల్ షేక్ కరీముల్లా జుబేర్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సింగపూర్ టౌన్షిప్ లో జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా తెలంగాణ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జె కే ఏ ఐ షాటో ఖాన్ కరాటే అకాడమీ అధ్యక్షులు, ఎగ్జామినర్ గుగులోత్ గోవింద్ నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన బెల్ట్ టెస్ట్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.



ఈ బెల్టు టెస్ట్ కార్యక్రమంలో మొత్తం 50 మంది కరాటే విద్యార్థులు పాల్గొన్నారు వారికి క్యూ లెవెల్ బెల్టు టెస్ట్ లో వారికి కిహోన్, కాటా, ఇప్పన్, కుడితే నిర్వహించడం జరిగినట్లు వారు తెలిపారు. అనంతరం వారికి ఈ పోటీల్లో వారి ప్రతిభను కనబరిచిన వారికి బెల్టులను సర్టిఫికెట్లను ఆయన చేతుల మీదుగా అందజేశారు. అనంతరం గోవిందు నాయక్ మాట్లాడుతూ కరాటే అనే యుద్ధ విద్యను నేర్చుకోవడం ద్వారా ఈ కాలంలో సమాజంలో జరుగుతున్నటువంటి అరాచకాలను, తమకు తాము కాపాడుకోవాల్సిన శక్తి పెరుగుతుందని, ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు కరాటేను పాఠంశంలో చేర్పించే విధంగా కృషి చేయాలని కోరారు. దీంతో సెల్ఫ్ కాన్ఫిడెన్స్ ఏకాగ్రత సెల్ఫ్ కంట్రోల్ సమాజంలో జరుగుతున్నటువంటి అరాచకాలను అరికట్టడానికి క్రమశిక్షణగా ఉండే విధంగా విద్యార్థులకు ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏం సాయి కిరణ్, ఎస్ కిరణ్ కరాటే పిల్లల తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# కక్కిరేణి చేతన హరీష్, బండారు శ్రీవాణి వెంకట్రావు

### సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు అర్పించిన కార్పొరేటర్లు

**హబ్సిగూడ, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** నిజాం మెడల వంచిన దిశాలి, హైదరాబాద్ సంస్థానాన్ని విముక్తి చేసిన ధైర్య శీలి, 530 కి పైగా సంస్థానాలను దేశంలో విలీనం చేసిన ఉక్కుమనిషి, స్వాతంత్ర సమరయోధుడు, భారత తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ఆదివారం రామంతపూర్ ప్రధాన రహదారి హోమియోపతి కాలేజ్ ఎదురుగా ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్, రామంతపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు, ముఖ్య



అతిథులుగా పాల్గొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు కక్కిరేణి చేతన హరీష్, బండారు శ్రీవాణి వెంకటరావు లు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు సంజయ్ పటేల్, హబ్సిగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శులు చెల్లోజు ఎల్లాచారి, చింతకింది ప్రవీణ్, బొమ్మగోని రఘుపతి గౌడ్, ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ ముత్తినేని జగదీష్, రామంతపూర్ డివిజన్ బిజెపి ప్రధాన కార్యదర్శి సంకురి కుమారస్వామి, కందకట్ల దయానంద రెడ్డి, పారుపల్లి హనుమంతరావు, పీసరి శంకర్, మట్ట అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

### స్టాఫ్ సెలక్షన్ కమిషన్ లో..

# ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం

**వేములవాడ, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ కి చెందిన యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ పొంది ఇద్దరు యువకులు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ జనరల్ డ్యూటీ విభాగంలో ఉద్యోగాలు సాధించారని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కానిస్టేబుల్ గొడిశెల రాజశేఖర్ గౌడ్ తెలిపారు. వేములవాడ రూరల్ మండలం జయవరం గ్రామానికి చెందిన అరవింద్ ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామానికి చెందిన రాకేష్ సెంట్రల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ ఫోర్స్ విభాగాలలో ఇటీవల జరిగిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలో అర్హత సాధించి ఉద్యోగాలు పొందారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ గత ఆరు నెలలు గా యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో



ఉచిత శిక్షణ పొంది యువకులు ఉద్యోగాలు సాధించారని యువకులు సమయం వృధా చేయకుండా చెడు వ్యాసనాలకు అలవాటు పడకుండా ఉన్నత లక్ష్యం పెట్టుకొని దాని కోసం ప్రయత్నం చేసి విజయం సాదించాలని కోరారు. అభ్యర్థులు మాట్లాడుతూ దేశం కోసం తమ వంతు బాధ్యతని నిర్వహిస్తాం అన్నారు. అన్ని విధాలుగా సహకారం అందించిన కానిస్టేబుల్ రాజశేఖర్ కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అని అన్నారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ రాజశేఖర్ ని, ఉద్యోగం సాధించిన యువకులను వేములవాడ రూరల్ ఎస్ ఐ మారుతీ అభినందించారు.

## యోగ ఆధ్యాత్మిక, శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపరిచేందుకు అద్భుతమైన సాధనం

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**సైనిక్ పురి, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** సైనిక్ పురి యోగ సెంటర్ 14 వ వార్షికోత్సవ సెలబ్రేషన్స్ లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. భారతీయ యోగ సంస్థాన్ సైనిక్ పురి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ యోగ అనేది మన ఆధ్యాత్మిక, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఒక అద్భుతమైన సాధనం. నిత్యం యోగ సాధన ద్వారా మన జీవనశైలిని మార్చుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఈడు కృష్ణ (రాష్ట్ర అధ్యక్షుడు), శ్రీధర్ సెంటర్ ఇంఛార్జి, జోన్ అధ్యక్షుడు పురుసోత్తం, రాజేశ్వర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రామ తులసి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ రెడ్డి, కాపు స్మశాన వాటికలో శివుని విగ్రహం ఏర్పాటు

### స్మశాన వాటిక అభివృద్ధికి సహకరించిన దాతలకు అభినందనలు తెలిపిన ప్రతినిధులు



**ఉప్పల్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** ఉప్పల్ రెడ్డి, కాపు స్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా దాత మేకల వెంకట్రామి రెడ్డి సహకారంతో వారి తల్లిదండ్రులు క్రీ"శే"మేకల నరసింహారెడ్డి-పుష్పమ్మ ల జ్ఞాపకార్థంతో స్మశాన వాటికలో శివుని విగ్రహాన్ని స్థాపించి ఆదివారం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఉప్పల్ రెడ్డి కాపు స్మశాన వాటిక అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ స్మశాన వాటిక అభివృద్ధికి సహకరించిన దాతలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు చేసే తెలిపారు. అభివృద్ధికి సహకరించిన మున్సిపల్ అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంల దుబ్బ నరసింహారెడ్డి, మేకల. మధుసూదన్ రెడ్డి, మేకల. హనుమంత్ రెడ్డి, గోనె.అర్జున్ రెడ్డి, షామీర్పేట్ ధర్మారెడ్డి, గిరి. రామకృష్ణ, ఉల్చ రాజు, కంచర్ల. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ వల్లభాయ్ పటేల్ కు ఘన నివాళి

**మేడ్చల్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ అర్చన కాలనీలో గల సర్దార్ వల్లభాయ్ పటేల్ కు వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు పి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ



హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసేందుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు కొండం ఆంజనేయులు ముదిరాజ్, అర్చన కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ చారి, ఉపాధ్యక్షులు బుచ్చిరాములు, బి జే పి నాయకులు ప్రభాకర్ రెడ్డి, కిషన్ రావు, ప్రేమ్ కుమార్, హరిబాబు రెడ్డి, వేముల సత్యనారాయణ రెడ్డి, ఇంద్రారెడ్డి, రాజు, రామ చంద్రారెడ్డి, కాలనీవాసులు హనుమంత్ రెడ్డి, గంగయ్య, మన్మధరావు, కమలాకర్ రెడ్డి, మోహన్ గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



**ఉప్పల్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** ఉప్పల్ మినీ శిల్పారామం లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం హైదరాబాద్ శివ సంకల్ప డాన్స్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది.

## వైద్యం కోసం ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే



**పెబ్బేరు, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** పెబ్బేరు పట్టణ కేంద్రంలో వివిధ కార్యక్రమాలకు వచ్చిన ఎమ్మెల్యే పట్టణ కేంద్రంలో లక్ష రూపాయల ఎల్ఓసి లెటర్ ను ఎమ్మెల్యే మేఘారెడ్డి మెరుగైన వైద్య చికిత్స కోసం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. పెబ్బేరు మండలం రాంపురం గ్రామానికి చెందిన బి.గణేష్ మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు అయిన 1లక్ష రూపాయల ఎల్ వో సి ని ఎమ్మెల్యే మేఘారెడ్డి చేతుల మీదుగా ఆదివారం సాయంత్రం వారి గ్రామస్తులచే కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మేము ఫారెస్ట్ అధికారులమని బెదిరింపు 20వేల రూపాయలు వసూలు.

### నిందితులను అరెస్టు చేసిన ఎస్ఐ గణేష్.



**ముస్తాబాద్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో నకిలీ ఫారెస్ట్ అధికారులను అరెస్టు చేశారు. ఈ నెల 13 శుక్రవారం రోజున కోట మహేష్ దానవేణి పల్లన్న అను వారు మండలంలోని చిప్పలపల్లి గ్రామ శివారులో ఏదులు (ముళ్ళ పంది) అమ్ముడానికి రాగా వా

## జిల్లా పరిషత్ పూడూర్ పాఠశాలలో సైన్స్ ఫెయిర్




**మేడ్చల్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** జన్య ల్యాబ్ ఇన్ ఎ బాక్స్ కార్యక్రమంలో భాగంగా జన్య ఫౌండేషన్ ఎస్ ఏ ఐ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో సమకూర్చిన బోధనా, అభ్యసన పరికరముల ద్వారా తరగతి గదిలో కృత్యముల ద్వారా నేర్చుకున్నటువంటి సైన్స్, గణితం అంశాలను విద్యార్థులు ముగ్గుల రూపంలో ప్రదర్శించడం జరిగింది. దీనివలన విద్యార్థులలో పటాలలోని భాగాలు వాటి నిర్మాణం గురించి ఎక్కువ కాలము గుర్తుంచుకోగలరని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనకు చేసిన కృషి వలన వారిలో సృజనాత్మకత, పట చిత్రీకరణ నైపుణ్యం, పటాలలోని భాగాలు గుర్తించటం, గుర్తించిన విషయాలను జ్ఞప్తికి ఉంచుకోవడం మొదలగు విషయాలను విద్యార్థులు సులభంగా అవగాహన చేసుకోగలరని, తద్వారా పఠనా సామర్థ్యం వారిలో పెరుగుతుందని అంతేకాకుండా సైన్స్, గణితం అంశాలను ఆడుతూ పాడుతూ ఎటువంటి ఒత్తిడి లేకుండా రివిజన్ చేసుకోవడమనేది అప్రయత్నంగానే జరుగుతోందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకరయ్య తెలిపారు.ఈ కార్యక్రమం లో సాయి లైఫ్ సైన్సెస్ ప్రతినిధిలు సుధ,సంగరాజు, బట్టాచార్య, జోమి జోస్, పాల్గొన్నారు.

## తూప్రాన్ సిఎస్ఐ చర్చిలో వైభవంగా సెమీ క్రిస్మస్ వేడుకలు..



**తూప్రాన్, డిసెంబర్ 14 (నిఘా న్యూస్):** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని సిఎస్ఐ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ఈ సెమి క్రిస్టమస్ వేడుకల్లో వివిధ గ్రామాల నుండి విచ్చేసిన విశ్వాసులు క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. అంతేకాకుండా కోలాటాలు, క్రిస్మస్ ఆట పాటలతో చిన్నారులు విశ్వాసులు అద్భుతంగా అలరించారు. ఈ సెమీ క్రిస్మస్ వేడుకలు వడియారం పాస్టరేట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ వేడుకల్లో తూప్రాన్ స్థానిక సంఘం పాస్టర్లు, బుడియారం పాస్టర్స్, ఇమాంపూర్, పోతరాజుపల్లి, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేశారు.

## గ్రూప్-2 పరీక్షా కేంద్రాల తనిఖీ చేసిన అదనపు కలెక్టర్




**రామంతపూర్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** గ్రూప్ 2 పరీక్షల నేపథ్యంలో ఆదివారం ఉప్పల్, రామంతపూర్ లోని మెగా మహిళా డిగ్రీ కాలేజ్, వాగ్దేవి డిగ్రీ కాలేజీలలో పరీక్ష నిర్వహణను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరగాలని జిరాక్స్ షాపులు మూసి ఉన్నాయా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఏబిసిడి వర్గీకరణ చేయాలి

- కుల గణన ఆధారంగా మాదిగలకు వాటా ఇవ్వాలి
- ఎస్సీ సెల్ బిఆర్ ఎస్ మండల అధ్యక్షుడు నల్లోల్ల పాండు



**అబ్దుల్లాపూర్ మెట్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏబిసిడి వర్గీకరణ చేయాలని కుల గణన ఆధారంగా మాదిగలకు వాటా ఇవ్వాలని అబ్దుల్లాపూర్ మెట్ బిఆర్ ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నల్లోల్ల పాండు అన్నారు. మాదిగ సోదరులు ఏబిసిడి వర్గీకరణ కోసం గత 30 సంవత్సరాలు సుదీర్ఘ పోరాటం చేశారని ఎస్సిల్లో అత్యంత వెనుకబడిన పేద ప్రజల స్థితిగతులు చాలా దుర్భరంగా ఉన్నాయని అందుకోసమే వర్గీకరణ కోసం ఎంతోమంది తమ జీవితాలను, త్యాగం చేశారని అన్నారు. రాజ్యాంగం ద్వారా అందాల్సిన ఫలాలు సక్రమంగా అందడం లేదని 30 ఏళ్లుగా పోరాటం జరుగుతుంది ప్రపంచ చరిత్రలో ఇంత పెద్ద ఉద్యమం ఎప్పుడు జరగలేదని కుల గణన ఆధారంగా మాదిగల వాటా మాకు ఇవ్వాలన్నదే మా డిమాండ్ అని అన్నారు. కెసిఆర్ హయాంలో దళిత శాసన సభ్యులను, పార్లమెంట్ సభ్యులను దళిత సంఘాలను వర్గీకరణ గురించి ఢిల్లీ వరకు కొట్లాడి పార్లమెంట్లో ఎమ్మార్పీఎస్ వర్గీకరణ గురించి బిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ సభ్యుల గొంతును వినిపించారు. సుప్రీంకోర్టు న్యాయబద్ధమైన తీర్పు ఇవ్వడం జరిగిందని కోర్టు తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాలని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వర్గీకరణ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆర్టికల్ 14 ప్రకారం ఆయా రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని కోర్టు తీర్పు ఇచ్చిన సందర్భంగా దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే ముందు తెలంగాణలో వర్గీకరణ చేస్తామని, ఆ తర్వాతే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తామని మాయమాటలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి పాత రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగాల భర్తీ చేస్తున్నాడు. కమిషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏబిసిడి వర్గీకరణ చేయాలని రేపు జరగబోయే అసెంబ్లీలో ఏబిసిడి వర్గీకరణ తీర్మానం చేయాలని వారు డిమాండ్ చేశారు.

# అభివృద్ధికి కేరఫ్ అడ్రెస్స్ గా మధిర

- మధిర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడేలా అభివృద్ధి.
- రూ.19 కోట్లతో సైడ్ కాలవ డ్రైనేజీ నిర్మాణంకి శంకుస్థాపన
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**మధిర, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** మధిర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా, అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గా మధిర ను అభివృద్ధి చేయనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆదివారం మధిర మున్సిపాలిటీలో ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద 19 కోట్ల రూపాయలతో నిర్మాణం చేయనున్న సైడ్ కాలువలు, ఫుట్ పాత్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధిర పట్టణం లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో ఇక్కడ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడుతాయి అని తెలిపారు. భవిష్యత్తు లో ఇతర ప్రాంతాల ప్రజలు మధిర లో స్థిర పడేందుకు ఇష్ట పడేలా మౌలిక వసతులు మెరుగు పరచడం జరుగుతుందన్నారు. నాలుగు సార్లు గెలిపించిన ఇక్కడి ప్రజలు ఋణం తీర్చుకుంటానని, మధిర అంటే అభివృద్ధి కి కేరఫ్ అడ్రెస్స్ గా నిలుపుతానన్నారు. మధిర పట్టణ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక కాంగ్రెస్

### మాజీ ఎమ్మెల్యే కె.ఎల్.ఆర్


### బడంగ్ పేట్ కార్పొరేషన్ లో సెమీ క్రిస్మస్ వేడుకలు



బాలాపూర్, డిసెంబర్ 15, (నిఘా న్యూస్): దేశంలో అన్ని కుల, మతాలను సమానంగా చూసే ఏకైక పార్టీ కాంగ్రెస్సేనని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. బడంగ్ పేట కార్పొరేషన్ నాదర్ గుల్ లో పాస్టర్ సాయిలు ఆధ్వర్యంలో బీయుపీఏ సెమి క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రిస్టియన్ బాయీ.. బాయీ అనే సిద్ధాంతాన్ని దేశానికి హస్తం పార్టీ నేర్పిందని గుర్తుచేశారు. కొన్ని పార్టీలు మత రాజకీయాలు చేస్తూ... దేశ పౌరుల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 25న క్రిస్మస్ వేడుకలను తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించి మత సామరస్యాన్ని చాటుతామని చెప్పారు. ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బతినకుండా అందరి దేవుళ్లను సమానంగా గౌరవిస్తామని ఆయన అన్నారు. రంగారెడ్డి జిల్లా నుంచి వచ్చిన క్రైస్తవ సోదర సోదరీమణులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్ లో ఉన్నత రాజకీయ పదవులు చేపట్టాలని ఆయనను పాస్టర్లు దీవెనలు అందించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### శ్రీ అయ్యప్ప దేవస్థానంలో..

# మహా పడిపూజ కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి హరీష్ రావు.



తూప్రాన్, డిసెంబర్ 14 (నిఘా న్యూస్): మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీ అయ్యప్ప దేవస్థానంలో ఏర్పాటు చేసిన మహా పడిపూజ కార్యక్రమానికి మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావ్ నర్సాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డిలు ముఖ్య అతిథిగా విచ్చేసినారు. ఇందులో భాగంగా అయ్యప్ప దేవాలయంలో వేద పండితులచే ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించినారు. దేవాలయంలోని వివిధ దేవుళ్ళ గర్భ గుడిలను దర్శించి ఆశీర్వాదం తీసుకున్నారు, అనంతరం అయ్యప్ప స్వాములతో కాసేపు మర్యాదపూర్వకంగా కలిసి మాటమంతి కలిపినారు. ఈ మహా పడిపూజలో గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ పాక్స్ వెంకట్ రామ్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు వెంకట్ గౌడ్, దుర్గారెడ్డి, తలారి మల్లేష్, భైరం సత్యలింగం, వివిధ సర్పంచులు, కత్తుల సత్యనారాయణ, టిఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ని కలిసిన బీజేపీ నాయకులు



**బాలాపూర్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు గంగాపురం కిషన్ రెడ్డిని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బండ్లగూడ సింగల్ విండో మాజీ చైర్మెన్ కోలన్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు హైద్రాబాద్ లో మర్యాద పూర్వకంగా కాకిసారు. ఈ సందర్భంగా వారు మెట్రో ట్రైన్ ను ఎల్బీ నగర్ నుండి బాలాపూర్ మీదుగా ఎయిర్ పోర్టుకు అనుసంధానం చేయాలని కోరారు. రంగారెడ్డి జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సమస్యలు పరిష్కరించాలని, అలాగే పార్టీ బలోపేతానికి ఎల్లప్పుడూ అండగా ఉంటూ ఆయన ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కీసర గోవర్ధన్ రెడ్డి, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, పి.భిక్షపతి చారి, గౌరి శంకర్, ఎస్సీ రాష్ట్ర నాయకులు చెవ్వ శ్రవణ్ కుమార్, మీర్ పేట్ కార్పొరేషన్ బీజేపీ ప్రధాన కార్యదర్శులు గాజుల మధు, కోడూరి సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి హైందవ శంఖారావ ధర్మ ప్రచారం





**గన్నవరం, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** గన్నవరం మండలంలోని గన్నవరం, పురుషోత్త పట్నం, గోపవరపుగుడెం, చిక్కవరం, కొత్తగూడెం, వీరపనేనిగూడెం, తెంపల్లి, బలిపర్రు గ్రామాలలో సమరసత సేవా ఫౌండేషన్ చేపట్టిన "ఇంటింటికి హైందవ శంఖారావ ధర్మ ప్రచారం" కార్యక్రమం గన్నవరం ఖండ కార్యవాహ ఎదురువాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ధర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనవరి 5 న జరగబోయే హైందవ శంఖారావం ఆహ్వాన పత్రికలను మొత్తం 600 ఇళ్లకు వెళ్ళి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని ప్రతి ఒక్కరికి పేరు పేరునా తెలియజేయడం. ఈ కార్యక్రమంలో గన్నవరం ఖండ కార్యవాహ ఎదురువాడ శ్రీనివాసరావు, గన్నవరం ఖండ ధర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు, యస్.యస్.యఫ్ సభ్యులు జాస్తి రాజేశ్వరి, యనమదల మదన్, చెరుకూరి సుబ్బారావు, అవుటుపల్లి శ్రీనివాసరావు, పామర్తి రవి (భజన కోలాటం గురువు) కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నాచారంలో బీజేపీ బూత్ కమిటీల నియామకం

### పోతగాని గోపాల్ గౌడ్, ఉప్పల్ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ ఆధ్వర్యంలో





**నాచారం, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్ బాబా నగర్ పరిధిలో జై హనుమాన్ శక్తి కేంద్ర ఇంచార్జ్ బిరాధర్ హనుమంత్ గారి బూత్ నెంబర్ 208,209,210 ల యొక్క బూత్ కమిటీ నియమించారు. రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం, సూచనల ప్రకారం బూత్ అధ్యక్షులుగా దర్శనాల వెంకటేశ్వర్లు, వినోద్ కుమార్ జాదవ్, మహేష్ బిరాదర్ లను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సభ్యత్వ నమోదు మేడ్చల్ జిల్లా సభ్యులు, ఉప్పల్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జి పోతగాని గోపాల్ గౌడ్, డివిజన్ ఎలక్షన్ ఇంచార్జ్ బొల్లం చంద్రమౌళి, డివిజన్ అధ్యక్షులు మల్కా ప్రకాష్, నవీన్ కుమార్, అభిషేక్ గౌడ్,మోహన్ రెడ్డి, రాజిరెడ్డి, నవీన్ గౌడ్,పాదం వెంకటేష్, శ్రీధరరెడ్డి,గోపి,ప్రతాప్ రెడ్డి, బూత్ కమిటీ సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

## మాధవ సేవా సమితి ఆధ్వర్యంలో ఆరేపల్లి,

### సీతారాంపూర్ బస్తీలో ఉచిత వైద్య సేవలు..



**కరీంనగర్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** మాధవ సేవాసమితి కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రోజున ఉచిత వైద్య శిబిరము నగరములోని ఆరెపల్లి సీతారాంపూర్ బస్తీలో గల శ్రీ రాజరాజేశ్వర కాలనీలో నిర్వహించారు. డాక్టర్.చక్రవర్తుల రమణాచారి, డాక్టర్.ఎల్.రవికాంత్, డాక్టర్ శేష శైలజ వైద్య బృందము పార్టీ వైద్య శిబిరంలో పాల్గొని బస్తీ లో అనారోగ్యంతో వున్న 115 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందుల పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరంలో భాగంగా మధుమేహ థైరాయిడ్ పరీక్షలను కూడా నిర్వహించారు. ప్రధానంగా బస్తీ లోని ప్రముఖులు బొజ్జయ్య బస్తి స్థితిగతులు ఆరోగ్య సమస్యల గురించి సమగ్రంగా తెలియజేశారు. అనంతరం డాక్టర్ రమణాచారి బస్తి వాసులకు ఆరోగ్య సూచనలు పరిశుభ్రతల గురించి బస్తీ వాసులకు వివరించారు. ఈ శిబిరంలో మాధవ సేవాసమితి అధ్యక్షులు ఎల్లంకి హనుమంతరావు, కార్యదర్శి గుర్రాల మహేశ్వర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి కామారపు ప్రసాద్, సమితి సభ్యులు విభాగ సహ వ్యవస్థ ప్రముఖ దావులూరి మురళీధర్జి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఊట్ల యోగ్య బర్త్‌డే సెలబ్రేషన్స్.





**మధిర, డిసెంబర్ 12 (నిఘా న్యూస్):** సిపిఐ మధిర మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు చంద్రకళ కుమారుడు పూర్ణచంద్రరావు దివ్య జ్యోతి దంపతులకు పెళ్లై రెండేళ్ల తర్వాత పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు.ఇక వారసురాలు రాకతో ఊట్ల కొండలరావు ఫ్యామిలీలో సంబరాలు అంబరాన్ని అంటాయి.అయితే యోగ్య పుట్టి సంవత్సరం కావడంతో ఆదివారం ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో పుట్టిన రోజు వేడుకలు కూడా ఘనంగా నిర్వహించారు. స్నేహ గార్డెన్ లో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో పెద్ద ఎత్తున బంధువులు వివిధ పార్టీలకు చెందిన రాజకీయ ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.యోగ్య పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న నాయకులు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మందడపు రాణి,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, కౌన్సిలర్ మల్లాది వాసు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి చావా మురళీకృష్ణ,సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాష్ రావు,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్,వివిధ హెూదాల్లో ఉన్న సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బత్తిని రవీందర్ నియామకం

**వలిగొండ, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఈ నెల13న తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిర్వహించిన మలిదశ ఉద్యమంలో క్రియాశీలంగా పనిచేసిన ఉద్యమకారులు బత్తిని రవీందర్ ను నియమించడం సంతోషకరమైన విషయం. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం గాదె ఇన్నయ్య తో టిఆర్ఎస్ పుట్టకముందే తెలంగాణ ఉద్యమంలో నడిచిన రవీందర్ ఎంపిక పట్ల తెలంగాణ ఉద్యమకారులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ జనసభ ఏర్పాటుతో వివక్షకు గురవుతున్న తెలంగాణ ప్రజలకు నీళ్లు నిధులు నియామకాలు అందాలని అందుకోసం ప్రత్యేక రాష్ట్ర సాధన అత్యవసరమని భావించి తెలంగాణ జన సభలో బత్తిని రవీందర్ క్రియాశీలకంగా పని చేశారు. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత కొద్ది మంది అమరవీరులను గుర్తించి, అత్యధిక మంది అమరవీరులను గుర్తించకుండా, అమరుల కుటుంబాలను, ఉద్యమకారులను కూడా నిర్లక్ష్యం చేసిన పరిస్థితి మన రాష్ట్రంలో ఉన్నది. ఈ పరిస్థితిని అధిగమించడం, ఉద్యమకారుల జీవితాలకు ఒక స్ఫూర్తి, రక్షణను కోరి గత ఆరు సంవత్సరాలుగా డాక్టర్ చీమ శ్రీనివాస్ నాయకత్వాన అలుపెరగకుండా నిరంతరం, ఉద్యమకారుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమం మొదలై, విస్తృతమై, తీవ్ర రూపం దాల్చుతున్న పరిస్థితి ఉన్నది. ప్రధానంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ముందుకు తీసుకొచ్చిన అంశాలు ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీ వేసి గుర్తింపు కార్డులుఇవ్వాలని, తెలంగాణ ప్రభుత్వమే స్వయంగా ప్రకటించిన 250 గజాల స్థలం, 25 వేల రూపాయల పెన్షన్ ఉద్యమకారులకు ఇవ్వాలని, ఉద్యమకారులకు ఇందిరమ్మ ఇళ్లలో పది శాతం కేటాయించాలని, ఉద్యమకారుల రక్షణకు బోర్డు ఏర్పాటు చేయాలని ఉద్యమ కళాకారులకు 1000 ఉద్యోగాలు ఇవ్వాలని ఉద్యమ కళాకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రజా పాలనలో భాగంగా ప్రభుత్వం ప్రకటించిన హామీని తక్షణమే నెరవేర్చే విధంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని ఉద్యమకారులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బత్తిని రవీందర్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో, ఉద్యమకారుల హక్కుల రక్షణ కోసం పోరాడేందుకు, తన బలగం లో చేర్చుకొని నాకు ఈ అవకాశం ఇచ్చిన, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీకి, ప్రధానంగా రాష్ట్ర కమిటీ చైర్మన్ డాక్టర్.చీమ శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.



# ట్రాఫిక్ రద్దీతో ప్రజలకు ఇబ్బందులు

### నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సిపిని కలిసిన ఎమ్మెల్యే



**కరీంనగర్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** గంగాధర మండలం మధుర నగర్ చౌరస్తాలో ట్రాఫిక్ రద్దీతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణ లోపించడంతో ఆ ఏరియాలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నాలుగు మండలాలకు ప్రధాన కూడలిగా ఉన్న మధురానగర్ చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ఆదివారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతిని కోరారు. దీనిపై స్పందించిన పోలీస్ కమిషనర్ ట్రాఫిక్ నియంత్రణ కోసం మధుర నగర్ చౌరస్తాలో పోలీస్ కానిస్టేబుల్ ను డ్యూటీలో ఉంచుతామని తెలిపారు. అనంతరం ట్రాఫిక్ రద్దీ విషయంపై ఆర్టీసీ మేనేజర్ ను ఎమ్మెల్యే సత్యం ఫోన్లో సంప్రదించగా ఆర్టీసీ బస్సులను రోడ్డుపై నిలపకుండా చర్యలు తీసుకుంటామని కరీంనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ తెలిపారు.

# అయ్యప్ప దేవాలయంలో అన్న ప్రసాదం



**చౌటుప్పల్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** అయ్యప్ప దేవాలయంలో అన్న ప్రసాద వితరణనను సూరపల్లి రవి-లక్ష్మి సాన్వి ఆర్యనాథన్, సామ యాది రెడ్డి-వైష్ణవి కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి వేద పండితులతో ఆశీర్వాదం తీసుకున్నారు. అన్నప్రసాద వితరణ దాతలు మాట్లాడతూ హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి పుట్టిన నేలపై శ్రీ శ్రీ శ్రీ జగద్గురువులు అది శంకరాచార్యులు జన్మించారు ఆదిశంకరాచార్యులు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పాదయాత్రలు చేసి ప్రజలందరినీ ఒక తాటిపైకి తెచ్చి ప్రజలందరూ ఒకటే ప్రజల మధ్యలో ఉన్న వ్యత్యాసాలను రూపుమాపటానికి ప్రయత్నం చేశారు. ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరు భక్తి భావంతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు బొబ్బిళ్ళ మురళి గురుస్వామి గురుస్వాములు తుర్పటి శంకర్ చింతల సాయిలు సుక్క సుదర్శన్ బోరం రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి ఆలయంలో లక్ష దీపోత్సవం



**జవహర్ నగర్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప మండల పూజలను పురస్కరించుకొని లక్ష దీపోత్సవాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. లక్ష దీపోత్సవం జవహర్ నగర్ గురు స్వాములు, కన్నె స్వాములు, కత్తి స్వాములు, గద స్వాములు అయ్యప్ప భక్తులు పాల్గొని ఎంతో ఘనంగా లక్ష దీపోత్సవాన్ని అయ్యప్ప నామస్మరణలతో విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గూప్త హాజరై మాట్లాడుతూ పిలిస్తే పలికే దైవం అయ్యప్ప స్వామి లక్ష దీపోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని, జవహర్ నగర్ ప్రజలకు అయ్యప్ప స్వామి కృప కటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నానని తెలిపారు. శ్రీమన్ గురుస్వామి, చెన్నారెడ్డి గురుస్వామి, కార్పొరేటర్ జమాల్పూర్ నవీన్ గురుస్వామి, గొడుగు వేణు, సంతోష్ గుప్తా గురుస్వామి, బోయిన్పల్లి నరసింహ గురుస్వామి, సిద్దేశ్వర గురుస్వామి, శ్రీనాథ్, రాజశేఖర్ గురుస్వామి, కమలాకర్ గురు స్వామి, రాజు గురు స్వామి, అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేటర్ ను పరామర్శించిన టిపిసిసి అధ్యక్షులు



**బోడుప్పల్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఐదవ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి లిఫ్ట్ ప్రమాదంలో గాయాలవడంతో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి తన నివాసంలో పరామర్శించారు. ఈ కార్యక్రమంలోపీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అమర్ సింగ్, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సమగ్ర వైద్య వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభం



**మేడిపల్లి, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లిలో చెంగిచెర్ల రోడ్డుకు జీనోమ్ ఫౌండేషన్ వారు తమ సమగ్ర వైద్య-వెల్‌నెస్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఇది ఆయుర్వేదం, అల్లోపతి, నేచురోపతి, హెూమియోపతి వంటి వైద్య విధానాలను సమన్వయ పరుస్తూ సమగ్ర ఆరోగ్య పరిష్కారాలను అందించే ఆధునిక వైద్య కేంద్రం. జీనోమ్ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గాంధీ పి.సి.కాజా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ లాల్‌జీ సింగ్ కు ఆయన హృదయపూర్వక స్మారక నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వక్తలు డాక్టర్ వి.ఆర్. రావు, డాక్టర్ తంగరాజ్, డాక్టర్.కార్తిక్ రెడ్డి, డాక్టర్ సంధ్య, డాక్టర్.కె.రాజేశ్వర రావు, డాక్టర్ సుగుణాకర్ లు పాల్గొన్నారు. వారు గట్ మైక్రోబయోమ్, న్యూట్రిషనల్ జీనోమిక్స్, నేచురోపతి వ్యక్తిగత వైద్యానికి జెనెటిక్స్ యొక్క పాత్ర వంటి విషయాలలో తమ అనుభవాలను, వైద్య శాస్త్రం సాధించిన ఆధునిక అభివృద్ధులను ఆహ్వానితులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణ 4.3 ఎకరాల స్థలంలో దాతలు, ప్రభుత్వ సహకారం తో సంస్థ పరిశోధనా ప్రాజెక్ట్ రాబోయే నిర్మాణం కూడా ప్రకటించబడింది. జీనెటిక్స్, ఫరెన్సిక్స్ సైన్సెస్, గట్ మైక్రోబైయోం పరిశోధన కోసం ఆధునిక సౌకర్యాలను నెలకొల్పే దిశగా ఇది ఒక ముందడుగు. ఈ ప్రాజెక్ట్ శాస్త్రీయ పరిశోధనలను ముందుకు తీసుకెళ్లడంలో వాటిని ఆరోగ్య పరిష్కారాలతో సమన్వయ పరచడంలో ఫౌండేషన్ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. డాక్టర్.గాంధీ పి.సి.కాజా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్న మెడిపల్లి సమాజానికి, ఇతర ప్రముఖులకు, ఈ లక్ష్యాన్ని సాధించడంలో అహర్నిశలు కృషి చేస్తున్న జీనోమ్ ఫౌండేషన్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వినూత్న కేంద్ర ప్రారంభం సాంప్రదాయ వైద్యం, ఆధునిక వైద్య విధానాలను కలిపి సమగ్ర ఆరోగ్య విధానాలను ప్రోత్సహించడం, పరిశోధనా విజ్ఞానాన్ని కమ్యూనిటీకి అందించడంలో ఒక ప్రధాన మైలురాయిగా నిలుస్తుంది.

# కరీంనగర్ లో నిషేధిత గంజాయి పట్టివేత

### నిందితుని అరెస్టు చేసిన పోలీసులు

**కరీంనగర్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** కరీంనగర్ నడిబొడ్డున నిషేధిత గంజాయిని అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ లోని సుర్జాపూర్ కు చెందిన నీరజ్ కుమార్ (19) కూలి పని చేస్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్ లో నివాసం ఉంటున్నాడు. సుమారు ఐదు నెలల క్రితం ఇతని స్వగ్రామమైన సుర్జాపూర్ వెళ్లి అక్కడ స్నేహితులతో నిషేధిత గంజాయిని తాగడానికి అలవాటు పడ్డాడు. ఎలాగైనా గంజాయి అమ్మి లాభాలు సంపాదించాలని స్వగ్రామం నుండి 15 రోజుల క్రితం రెండు కిలోల గంజాయిని కొని రైలు ద్వారా కరీంనగర్ కు తీసుకువచ్చాడు. అప్పటినుండి అందులో కొంత గంజాయిని తాగడానికి ఉంచుకొని, మిగిలిన ఒక కేజీ 65 గ్రాముల నిషేధిత గంజాయిని ఎవరికైనా అమ్మి పోత లాభం సంపాదించాలని ఉద్దేశంతో అతని రూమ్ నుండి బయలుదేరి కాపు వాడ బైపాస్ వైపు వెళు తుండగా గౌరిశెట్టి కాంప్లెక్స్ దగ్గర పోలీస్ వాహనాన్ని చూసి పారిపోయే ప్రయత్నంలో గంజాయితో ఉన్న పాలిథిన్ కవర్ తో పోలీసులకు దొరికాడు.




పోలీసులు ఒక కేజీ 65 గ్రాముల గంజాయి తో పాటు అతని సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కరీంనగర్ ఒకటవ టౌన్ సిఐ తెలిపారు.

# హ్యాండ్, ఫుట్, మౌత్ వ్యాధి పై అవగాహన అవసరం

### శిశు వైద్య నిపుణులు డాక్టర్.శిల్పిక రాణి



**తాండూరు, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** హ్యాండ్, ఫుట్, మౌత్ వ్యాధి (చేతి, పాదం, నోటి వ్యాధి) చలికాలం ప్రారంభమైన నవంబర్, డిసెంబర్, జనవరిలో నెలలో సంక్రమిస్తుందని తెలిపారు. 6 నెలల నుండి, ఐదు సంవత్సరాల చిన్నారులలో ఈ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని చిన్నారుల వైద్య నిపుణులు డాక్టర్ శిల్పికరాణి వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాండూరు పట్టణ కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దరిమీది రవిశంకర్ ఆధ్వర్యంలో తనతో పాటు, చిన్నారుల వైద్యనిపుణులు చిన్నారులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని వివరించారు. చిన్నారులలో చలికాలంలో జ్వరం, గొంతు నొప్పి, జలుబు, దగ్గు రావడం, తిన్న ఆహారం, తాగిన నీరు గొంతు ద్వారా మింగడానికి ఇబ్బందిగా అనిపించడం, నోట్లో, గొంతులో, ఎర్రటి గుల్లలు రావడం, దీంతోపాటు అరచేతులకు, పాదాలకు ఎర్రటి గుల్లలు రావడం, నోటిలోనుండి జొళ్ళు కారడం, శరీరంలోని తదితర భాగాలలో నీటి గుల్లలు వంటి లక్షణాలు కనిపించడం వెంటనే చిన్నారుల వైద్య నిపుణులను సంప్రదించాలని సూచించారు. డాక్టర్ల సూచనల ప్రకారం చిన్నారులకు వైద్యం చేయించాలని కోరారు. అదేవిధంగా ఈ లక్షణాలు కలిగిన చిన్నారులకు వ్యాధి తగ్గేవరకు పాఠశాలకు పంపించకపోవడమే శ్రేయస్కరమని హితవు పలికారు. ఈ వ్యాధి ఒకరి నుండి ఇంకొకరికి సంక్రమిస్తుందని గుర్తు చేశారు. ఈ వ్యాధిని అంటువ్యాధిగా పరిగణించడం జరుగుతుందని పేర్కొన్నారు. 5 రోజుల నుండి, 7 రోజులలో వ్యాధి తగ్గుతుందని చిన్నారుల తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. ఈ వ్యాధికి భయపడవలసిన అవసరం లేదని సూచించారు. ఈ వ్యాధిపై అవగాహన మాత్రం కలిగి ఉండాలన్నారు. పైన సూచించిన లక్షణాలు కనిపించిన వెంటనే చిన్నారులు వైద్య నిపుణులను సంప్రదిస్తే సాధారణ వైద్యంతోనే వ్యాధిని నయం చేయడం జరుగుతుందని తెలిపారు. డీహైడ్రేషన్ కు గురైన చిన్నారులకు సెలైన్ ఎక్కించడం జరుగుతుందని అన్నారు. ఈ వ్యాధికి కారణం వైరల్ ఇన్ఫెక్షన్ అని తెలిపారు. చిన్నారుల వ్యక్తిగత పరిశుభ్రత విషయంలో చిన్నారుల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. చిన్నారులు తరచుగా చేతులు శుభ్రం చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. ఒకరి వస్త్రాలు ఇంకొకరు ధరించకుండా, వాడకుండా ఉండాలని సూచించారు.

# ఎంపీజే ఉద్యమ పోస్టర్ ఆవిష్కరణ



**ప్రొద్దుటూరు. డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** స్థానిక పెన్నా నగర్ లోని ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం జాయిన్ ఎంపీజే ఉద్యమ పోస్టర్స్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జమాత్ ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ రఫీ, కార్యదర్శి గౌస్ మొహిద్దిన్, ఎస్ ఐ ఓ జాతీయ అధ్యక్షులు బ్రదర్ అబ్దుల్ హఫీజ్, ఎంపీజే రాష్ట్ర కార్యదర్శి సలీం, పోస్టర్స్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ యంపీజే భావాలకు దగ్గరగా ఉండే వ్యక్తులు, స్త్రీలు, పురుషులు శాంతి స్థాపన కోసం యంపీజే సంస్థలో చేరవచ్చని తెలిపారు. దేశ నిర్మాణానికి, సమాజ నిర్మాణానికి పటిష్టమైన సూత్రాలు రూపొందించడం, న్యాయ వ్యవస్థను సరళంగాను, చౌకగాను చేసి మానవ హక్కులను పరిరక్షించడం, దేశంలో వివిధ మతాల మధ్య సోదరభావం నెలకొల్పోడం శాంతి భద్రతలను కాపాడం, మత,భాష సాంస్కృతిక వర్గాల హక్కులను కాపాడడం, సామాజిక హెచ్చుతగ్గులు, ఆర్థిక దౌర్జన్యాలు, అన్యాయాలను అరికట్టడం, బీదరికం, అనారోగ్యం, అజ్ఞాలను నిర్మూలించడం, సమాజంలో స్త్రీలకు సరైన నియమబద్ధమైన స్థానం కల్పించడం, దేశంలో ప్రజాస్వామ్య విలువలను పటిష్టపరచడం, ఫాసిజాన్ని అరికట్టడం, ప్రభుత్వం,పాలన యంత్రాంగాలను వాటి బాధ్యతల పట్ల జాగృత పరచడం, రండి,సుందర సమాజ నిర్మాణం కోసం ఎంపీజే లో చేరాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉగ్రి, పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాష, ఉపాధ్యక్షుడు నజీర్ అహ్మద్, కార్యదర్శి మహమ్మద్ రఫీ, మీడియా కార్యదర్శి అస్లాం, కోశాధికారి ఇస్మాయిల్, సభ్యులు ముక్తయార్, ఖాజా, అల్లాబకాష్, ఆజం, తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే



**పెబ్బేరు, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** పెబ్బేరు పట్టణంలో అయ్యప్ప ఆలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన అయ్యప్ప 13వ పడిపూజ మహెూత్సవంలో ఆదివారం వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పడిపూజ అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రసార సమితి వ్యవస్థాపకులు రాజేష్ పాండే గురుస్వామి ఆద్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అయ్యప్పస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామివారి పడిపూజ మహెూత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలపై అయ్యప్ప స్వామివారి కృప, చల్లనిచూపు తప్పక ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అయ్యప్ప స్వామి భక్త బృందం తదితరులు పాల్గొన్నారు

# హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయ బ్రహ్మోత్సవ ఉత్సవాలు

### హాజరైన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**అబ్దుల్లాపూర్ మెట్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** ఇబ్రహీం పట్నం నియోజకవర్గం పెద్దఅంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధి తారమతి పేట్ లోని హరిహర పుత్ర ధర్మ శాస్తా శ్రీఅయ్యప్పస్వామి దేవాలయ 2వ బ్రహ్మోత్సవాల ఉత్సవానికి ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చామ విజయ్ శేఖర్ రెడ్డి, ముత్యాల రాజశేఖర్, తారమతి పెట్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులతో పాటు అయ్యప్ప దీక్షాపరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పల్లె దవాఖానాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**జగిత్యాల, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** రాయికల్ మండలం బోర్నపల్లి, ధర్మాజీ పేట గ్రామాలలో 20 లక్షల చొప్పున నిధులతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పల్లె దవాఖానాల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసిన జగిత్యాల శాసనసభ్యులు డా.సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీనివాస్, నాయకులు కోల శ్రీనివాస్,రవీందర్ రావు, గన్నె రాజీరెడ్డి,పడిగేల రవీందర్ రెడ్డి,పాదం లత రాజు,మాజీ ఎంపీటీసీ బీర్సావ్,మర్రిపెల్లి శ్రీనివాస్ గౌడ్,మాజీ ఏఎంసి డైరెక్టర్ తిరుపతి గౌడ్,మాజీ మండల కో ఆప్షన్ ముకీద్,ప్రవీణ్ రావు,మల్లారెడ్డి, మదు,తూకారం,మాజీ సర్పంచ్ లు అనిపురం శ్రీనివాస్ సమల్ల వేణు,పాల కుర్తి రవి గౌడ్,గంగారం, మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్,నాయకులు ఆకుల మల్లేశం, అభిరామ్,సంజీవ్,తిరుపతి నాయక్,చిరంజీవి,డిఈ మిలీంద్, ఏ ఈ ప్రసాధ్ డా.సంతోష్,నాయకులు,అధికారులు,వైద్య సిబ్బంది,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు వరంగా ముఖ్యమంత్రి సహాయ నిధి



**పటాన్ చెరు, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** ఆపద కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఆపన్న హస్తం అందిస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల గ్రామానికి చెందిన భోగయ్య కుమారుడు శ్రీనివాస్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో మెరుగైన చికిత్స కోసం స్థానిక ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. చికిత్స కోసం మంజూరైన 2 లక్షల 50వేల రూపాయల విలువైన ఎల్ఓసి అనుమతి పత్రాన్ని ఆదివారం ఎంఎల్ఏ జిఎంఆర్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా పాలన అందిస్తున్నామని తెలిపారు.



## దేవాలయాలను సందర్శించిన ప్రభుత్వ విప్

**వేములవాడ, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** వేములవాడ పట్టణంలోని శ్రీ దత్తాత్రేయ స్వామివారిని, కేదారేశ్వర స్వామివారిని ఆదివారం ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేదారేశ్వర స్వామి వారి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ స్వామివారి కృప కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నారు.

## కస్తూర్బా పాఠశాలను సందర్శించిన కవిత




**జగిత్యాల, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలంలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ వారు మాట్లాడుతూ పెంచిన డైట్ చార్జీలను కస్తూర్బా పాఠశాలలకు వర్తింప జేయకపోవడం బాధాకరం అన్నారు. కస్తూర్బా పాఠశాలలకు కూడా పెంచిన డైట్ చార్జీలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 472 కస్తూర్బా పాఠశాలలున్నాయి. విద్యార్థులు అందరికీ పౌష్టికాహారం అందించాలని, సర్వ శిక్ష అభియాన్ కింద పాఠశాలల్లో పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేస్తామని గతంలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని.ఈ ఉపాధ్యాయులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.కెసిఆర్ మొదలు పెట్టిన గురుకుల పాఠశాలల లక్ష్యాన్ని దెబ్బ తీయకూడదని విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ప్రభుత్వం రాజీ పడకూడదు అన్నారు.

## గురునాధం చెరువు అభివృద్ధికి కృషి

### కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి శ్రీకాంత్



**శేరిలింగంపల్లి, డిసెంబర్ 14(నిఘా న్యూస్):** గురునాధం చెరువు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మియాపూర్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు.మియాపూర్ డివిజన్ పరిధిలోని గురునాథం చెరువు సుందరికరణలో భాగంగా నెక్సస్ సెలెక్ట్ మాల్ కంపెనీ వారి సీయస్ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టినటువంటి చెరువు సుందరికరణ, పునరుద్ధరణ పనులను స్థానిక నాయకులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ గురునాథం చెరువు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటూ మురికి కూపంలాంటి చెరువును స్వచ్ఛమైన మంచి నీటి చెరువుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లోకేష్ రమేష్ అనిల్ రాజేష్ సుధాకర్ కె ఏస్ బాబు, నాగరాజు తదిరులు పాల్గొన్నారు.

# అనుమతులకు మించి బహుళ అంతస్తులు

### ఘట్కేసర్ లో ఇస్తారాజ్యంగా అక్రమ నిర్మాణాల జోరు






**ఘట్‌కేసర్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** అధికారుల అండదండలతో అనుమతులకు మించి బహుళ అంతస్తులను నిర్మిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారలు. పోచారం మున్సిపాలిటీ పరిధిలో అధికారికంగా తీసుకునే అనుమతులు వేరు, వారు నిర్మించేది వేరు, వారి ఇష్ట రాజ్యాంగ బహుళహంతస్తులు నిర్మించి, మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారని స్థానిక ప్రజా ప్రతినిధులు విమర్శలు గుప్పిస్తున్నారు.ఇన్ని విమర్శలు వెల్లువెత్తుతున్న ప్పటికీ, అవేమీ పట్టనట్టుగా ఇటు అధికార యంత్రాంగం, అటు పాలకవర్గం వ్యవహరిస్తుందని, పలువురు వాపోతున్నారు. గత మున్సిపల్ కమిషనర్ వేమన్ రెడ్డి పదవీ విరమణ చేసిన తర్వాత, వచ్చిన కమిషనర్ వీరారెడ్డి, అభివృద్ధిపై కంటే, ముడుపులు అందుకునే విషయంలోనే, ఎక్కువ శ్రద్ధ పెట్టినట్టు, మున్సిపాలిటీలో కొత్తగా విలీనమైన గ్రామాలలో విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.మున్సిపాలిటీలో ఎవరిని కదిలించిన కమిషనర్ గురించి ఇదే మాట చెబుతున్నారు. కౌన్సిలర్లు అడిగే వరకు సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసే సోయి లేకపోయిందని, పలువురు కౌన్సిలర్లు విమర్శిస్తున్నారు. వార్డులలో కౌన్సిలర్ చెప్పినటువంటి ఎపని చేయడంలేదని కౌన్సిలర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌన్సిలర్ల పదవీ కాలము ముగియనుందని, ఇక వారితో మాకేంటి పని, అన్న విర్రవీగుడుతనము మానుకోవాలని కౌన్సిలర్ హెచ్చరించారు. మా పదవి ఉంటే ఏమి, లేకుంటే ఏమి, మేము స్థానికంగా ఉండేది ఇక్కడేగా, మీ పనితీరును నిత్యం పరిశీలించి, ఎప్పటికప్పుడు ఎండగడతామనీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా వసూళ్లు మానుకొని అభివృద్ధిపై శ్రద్ధ పెట్టాలని పలువురు కోరుకుంటున్నారు.

# సర్దార్ పటేల్ విగ్రహానికి నివాళులు



**జగిత్యాల, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో ఆదివారం మాజీ హోం మంత్రి ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నాయకులు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పిస్తూ, బలమైన సంపన్నమైన భారత దేశానికి పునాది వేసిన ఉక్కు మనిషి అనకొనియాడారు. దేశ సమైక్యత, సమగ్రత, సార్వభౌమాధికారాన్ని కాపాడేందుకు ఆయన చూపిన బాట మనకు ఎల్లవేళలా స్ఫూర్తినిస్తుందని అన్నారు.భారతదేశం మొదటి హోం మంత్రి, ఉప ప్రధాన మంత్రి అయిన స్వాతంత్ర్య సమరయోధుడు పటేల్, స్వాతంత్ర్యం తరువాత వందలాది రాచరిక సంస్థలను భారత యూనియన్‌తో ఏకీకృతం చేయడం ద్వారా ఒప్పించడం, సంభాషణలు, అవసరమైనప్పుడు బల ప్రయోగం చేయడం ద్వారా ఘనత పొందారని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఏ సి ఎస్ రాజు, పుప్పాల సత్యనారాయన, చిట్ల గంగాధర్,జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కశినాథం బిందుకురి శ్రీనివాస్, గదాసు భూమన్న ,కొత్తకొండ బాలన్న బండి సత్యనారాయన, వెల్గొండ నారాయణ రావు, గడ్డల సుఘునకర్ సిరిపురం గంగారం సత్యనారాయణ తునికి అంజన్న బండారి మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు..

# మల్లన్న స్వామికి బెల్లంతో నైవేద్యం



**నిజాంపేట్, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** సంగారెడ్డి జిల్లా కొత్తపల్లిలో ఆదివారం కురుమలు డోలు చప్పుళ్లతో కురుమల అరధ్య దైవం మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మల్లన్న స్వామికి బెల్లంతో నైవేద్యం సమర్పించిన అనంతరం కురుమ కులస్తులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కురుమల ఆరాధ్య దైవం మల్లన్న స్వామికి నైవేద్యం సమర్పిస్తారని పేర్కొన్నారు. అలాగే కురుమలు అర్ధ సంచార జీవులు కురుమల జీవనాధారం గొర్రెలు ఆరు నెలలు ఇంటిదగ్గర ఉంటారు. మరో ఆరు నెలలు గొర్రెలు మేపు కోవడానికి కొండప్రాంతాలకి తీసుకెళ్తారు గొర్రె కాపర్లు అడవి ప్రాంతంలో చెట్లు పుట్టలు పాములు తేళ్లు ఉన్నచోట రాత్రింబవళ్లు గొర్రెలతోనే ఉంటారు. కాబట్టి వారికి ప్రభుత్వం గుర్తించి (ఎస్ ఎన్ టి) రిజర్వేషన్ కల్పించి వారికి సామాజిక ఆర్థిక విద్య సమూలంగా కల్పించాలని అలాగే కర్ణాటక రాష్ట్రంలో కురుమలు ఎస్సీ లేదా ఎస్టి లో ఉన్నారు. కాబట్టి తెలంగాణలో కూడా కురుమలను ఎస్సీ లేదా ఎస్టిలో చేర్చాలని పేర్కొన్నారు. లేనియెడల దశలవారీగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని ది మా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కురుమ కిష్టయ్య ఉప సర్పంచ్ మల్లేష్ శంకర్ అంజయ్య బీరయ్య హన్మంత్ లింగయ్య మల్లేష్ కుమార్ పెద్ద భూమయ్య సాయిలు శ్రీనివాస్ భాను బీరప్ప శ్రీనివాస్ సాయిలు శివకుమార్ సాయిలు శ్రీకృష్ణ చందు తదితరులు పాల్గొన్నారు.




## మా కాలనీలో డంపింగ్ యార్డు వద్దు

### ప్లకార్డులతో దీప్తి శ్రీనగర్ కాలనీ వాసుల ధర్నా

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** మా కాలనీ వద్ద ఉన్న డంపింగ్ యార్డును ఇక్కడి నుండి తొలగించాలని,కాలనీలో నుండి చెత్త ఆటోలు,టిప్పర్ లారిలు వెళ్లకూడదని దీప్తి శ్రీనగర్ కాలనీ వాసులు డిమాండ్ చేశారు.మా కాలనీలను డంపింగ్ యార్డ్ కాలుష్యం నుండి కాపాడుకుందాం, మా కాలని ముద్దు డంపింగ్ యార్డు వద్దు అని దీప్తి శ్రీ నగర్ కాలని వాసులు ధర్నా చేపట్టారు. కాలనీలో నుండి ఆటోలు వెళ్ళనివ్వకుండ కాలనీ వసూలు అడ్డుకున్నారు. దీంతో కాలనీలో చెత్త ఆటోలు రోడ్డుపై నిలిచిపోయాయి. ఆటోలు రోడ్లపైనే నిలిచోవడంతో కాలనీలో ట్రాఫిక్ ఇబ్బంది తలెత్తింది.సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని కాలనీ వాసులతో మాట్లాడి చెత్త ఆటోలురిక్షాలు డంపింగ్ యార్డుకు పంపించి వేశారు.మా కాలనీలో నుండి చెత్త వాహనాలు వెళ్ళకూడదని డిమాండ్ చేశారు.

## ఘనంగా దత్త జయంతి



**శేరిలింగంపల్లి, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** భారతి నగర్ డివిజన్‌లో దత్త జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఓల్డ్ ఎంఐజి కాలనీలోని సాయిబాబా ఆలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించిన దత్త జయంతి వేడుకల్లో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ,భారతి నగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు రెడ్డి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి సుప్రభాతం, కాకడహారతి, పాదపూజ, బిల్వార్చన,అష్టోత్తర నియమావళి, పంచామృత అభిషేకం నిర్వహించారు.దత్త జయంతి వేడుకల్లో మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిరి,ఆలయ కమిటీ సభ్యులు అనిత,ప్రసాద్, సావిత్రి, మాజీ డైరెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్‌ను కలిసిన శ్రీకాళహస్తి జనసేన నేతలు



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 15 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ వినుతకోట ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మానవవనరుల, ఐటీ శాఖా మంత్రి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి వినుత కోటా చంద్రబాబు కోటా ఉండ్రవల్లి లోని ముఖ్యమంత్రి నివాసంలో కలిశా రు. నియోజక వర్గంలోని రాజకీయ పరిస్థితులు , కూటమి సమన్వయంపట్ల సుదీర్ఘంగా చర్చించారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం తరఫున గ్రామాల్లో సమస్యలపై ప్రజలకు ఇచ్చిన హామీలు గురించి, నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చించడం జరిగింది.

# వెలమ దొరను... ఎక్సైజ్ శాఖ నుండి తప్పించాలి

### గీత వృత్తిపై జులుం చేస్తున్న జూపల్లి

### వ్యవహార శైలి మార్చుకోవాలి : విక్రమ్ గౌడ్



**హైదరాబాద్, డిసెంబర్15 (నిఘా న్యూస్):** రాష్ట్ర వ్యాప్తంగా గత కొంతకాలంగా కల్లుగీత వృత్తిపై కల్లు దుకాణాలపై అక్రమంగా ఎక్సైజ్ అధికారులు, నార్కోటిక్ అధికారులు, పోలీసులు దాడులు చేస్తున్నారని మంత్రి ఆదేశాలతోనే విచ్చలవిడిగా గీత కార్మికులపై కక్ష పూరిత చర్యలు చేస్తున్నారని ఈ చర్యను తక్షణమే ఆపకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్ గౌడ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ లో కాంగ్రెస్ మేనిఫెస్టోలో గౌడలకు 25 శాతం వైన్స్ బార్ లలో రిజర్వేషన్ కల్పిస్తామని మరియు గీత కార్మికులకు అనేక సదుపాయాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి మంచి చేయక పోగా కల్లుగీత కార్మికులపై అణిచివేత ధోరణితో ముందుకు వెళ్తున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇలాంటి చర్యలతోనే ప్రభుత్వాలు పడగొట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. తెలంగాణ ఏర్పడిన నాటి నుండి ఎక్సైజ్ శాఖకు బీసీనే మంత్రిగా కొనసాగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఒక వెలమ దొర జూపల్లి కృష్ణారావుకు ఆ శాఖని కేటాయించడంతో కల్లుగీత వృత్తికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. శాంపిల్ల పేరుతో, కల్తీకల్లు నెపంతో నార్కోటిక్ అధికారులు పోలీసు అధికారులు, ఆబ్కారి అధికారులతో సహా అందరూ కలిసి ఏకకాలంలో హైదరాబాద్‌తో సహా రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, మహబూబ్ నగర్ జిల్లాలలో అప్రకటిత దాడులు చేసి వందలాది గౌడ బిడ్డలను జైల్లో పెట్టి చిత్ర హింసలకు గురి చేస్తున్నారు. దాదాపుగా ఆరు లక్షల కుటుంబాలు గీత వృత్తిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. ఈ దాడులకు ప్రధాన కారకులు జూపల్లి కృష్ణారావును మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కల్లుగీత వృత్తిని ఎక్సైజ్ శాఖను బీసీ మంత్రికి కేటాయించాలని ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈడిగ శ్రీనివాస్ బీసీ యువజన సంఘం కార్యనిర్వక అధ్యక్షులు, విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి ఇంద్రమ్ రజక, గూడూరు భాస్కర్, కార్తీక్ గౌడ్, అర్జున్ మధుసూదన్, మోహన్ రావు పాల్గొన్నారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com